


RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం – మా పంతం




కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 276 శనివారం, అక్టోబర్ 24 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

# భక్తి ముసుగులో 'రత్నాల' దందా.. సిరిసిల్లలో అమాయకులే టార్గెట్!

- రంగురాళ్లకు లక్షల విలువ అంటూ బురిడీ..
- దోషాలు, శని, రాహు పేరుతో భయపెట్టి వసూళ్లు
- రూ.500 విలువ చేయని రాళ్లకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ధరలు
- నాణ్యత పేరుతో బూటకపు ధృవపత్రాలు ఇస్తున్నారన్న ఆరోపణలు
- ఆలయాలనే వేదికగా చేసుకుని భక్తులను ఆకర్షిస్తున్న మాయగాళ్లు?
- కొందరు అర్చకులే దళారులుగా మారారన్న ఆరోపణలపై విచారణ ఏది?




**సిరిసిల్ల జోర్దార్ నిఘా విభాగం**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భక్తి, జాతకాలు, గ్రహదోషాల పేరుతో నకిలీ రత్నాల దందా సాగుతోందన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. నవరత్నాలు, జాతక రాళ్లంటూ సాధారణ రంగురాళ్లను అంటగట్టి అమాయక ప్రజల నమ్మకాన్ని సొమ్ము చేసుకుంటున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. రాళ్లు ధరిస్తే కష్టాలు తొలగిపోతాయని, అప్పులు తీరుతాయని, ఉద్యోగం వస్తుందని, పిల్లలకు వివాహం జరుగుతుందని నమ్మబలుకుతూ భారీ మొత్తాల్లో విక్రయాలు చేస్తున్నారని వాపోతున్నారు.

**రంగురాళ్లకు భారీ ధరలు**

కరంగి మాలలు, లాకెట్లు, దేవతల బిళ్లలు తదితర పేర్లతో తక్కువ విలువైన రంగురాళ్లను రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి రూ.500 కూడా విలువ చేయని రాళ్లకు లక్షణాలు, మహిమలు ఆపాదించి అధిక ధరలకు అంటగడుతున్నారని బాధితులు చెబుతున్నారు. రాళ్ల నాణ్యతను పరీక్షించామని చెబుతూ ఇచ్చే ధృవపత్రాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**దోషాల పేరుతో భయపెట్టే ప్రయత్నం?**

రాహు, శని, కుజ దోషాలు ఉన్నాయని, నిర్దిష్ట రత్నం ధరిస్తే సమస్యలు తొలగిపోతాయని కొందరు ప్రజలను నమ్మిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు, వివాహ సమస్యలు, ఉద్యోగం, కుటుంబ సమస్యలతో వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని వారి భయాలను ఆసరాగా చేసుకుని రత్నాలు విక్రయిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**ఆలయాలే అడ్డాగా మారాయా?**

ఈ వ్యవహారంలో కొన్ని ఆలయాల పేర్లు వినిపిస్తుండటం మరింత చర్చనీయాంశంగా మారింది. ఆలయాలకు వచ్చే భక్తులను జాతక దోషాల పేరుతో భయపెట్టి, ఫలానా వ్యక్తి వద్ద రత్నం తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుందని కొందరు అర్చకులు సూచిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రత్నాల విక్రయదారులకు భక్తులను పరిచయం చేసి ప్రతిఫలంగా వాటా తీసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

ప్రజల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని మోసాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ, పోలీసు, తూనికలు--కొలతల శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రత్నాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి రాళ్ల అసలు నాణ్యతను, వాటి ధరలను, విక్రయదారులు ఇస్తున్న ధృవపత్రాల వాస్తవికతను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయాల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

# స్లాట్ బుకింగ్ చేశారు రిజిస్ట్రేషన్ మరిచారు

- ఓదెల తహసీల్దార్ కార్యాలయంలో నాలుగుసార్లు ఆగిన భూ నమోదు - తెరవెనుక కుట్ర ఏమిటి?
- ఆడబిడ్డల పేరిట భూమి నమోదుకు వెళ్తే వాయిదాల పర్వం - సాంకేతిక కారణమా, కావాలనే జాప్యమా?
- గోప్యంగా ఉండాల్సిన నమోదు సమాచారం బయటకు ఎలా వెళ్లింది? కార్యాలయంలో నల్లగొర్రె ఎవరు?
- జిల్లాధికారి జోక్యం చేసుకుని విచారణ జరపాలంటున్న బాధితులు - ధరణి నిర్వహకుల తీరుపై అనుమానాలు




**(పెద్దపల్లి/ఓదెల/ జోర్దార్ ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లా ఓదెల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న తీరు ఇప్పుడు తీవ్ర అనుమానాలకు, విమర్శలకు దారితీస్తోంది. రూపునారాయణపేట మాజీ ఎంపీటీసీబొంగోని సుగుణ – నారాయణ దంపతులు తమ కుమార్తెల పేరిట చేయదలచిన భూ నమోదు ప్రక్రియ నాలుగుసార్లు వాయిదా పడటం స్థానికంగా కలకలం రేపుతోంది

**నాలుగుసార్లు వాయిదా ఎందుకు పడింది?**

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, ఆడబిడ్డల పేరిట భూమిని నమోదు చేసేందుకు నిబంధనల ప్రకారం రుసుము చెల్లించి, గత నెల 29న సమయం నమోదు చేసుకున్నారు. అయితే ఆ సమయం ఒకసారి కాదు, ఏకంగా నాలుగుసార్లు వాయిదా పడింది.ప్రతిసారి కార్యాలయానికి వెళ్తే సాంకేతిక కారణాలు అంటూ చెబుతున్నారని, కానీ అసలు కారణం మరేదో ఉందని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా సాంకేతిక లోపమే అయితే ఒకసారి, రెండుసార్లు వాయిదా పడవచ్చు, కానీ నాలుగుసార్లు వరుసగా వాయిదా పడటం వెనుక ఎవరైనా కావాలనే అడ్డుకుంటున్నారా అనే ప్రశ్న తలెత్తుతోందని గ్రామస్తులు అంటున్నారు.

**రహస్య సమాచారం బయటకు ఎలా వెళ్తోంది? – అసలు కుట్ర ఇక్కడే ఉందా?**

ఈ వ్యవహారంలో అత్యంత అనుమానాస్పదమైన అంశం సమాచారం బయటకు వెళ్లడం.ఓదెలలో నమోదు జరుగుతుంటే, దూర ప్రాంతంలో ఉన్న కుమారుడు శ్రీనివాస్ కు ఆ నమోదు వివరాలు, సమయం, తేదీ ఎలా తెలిసాయన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకున్న గోప్య సమాచారం అత్యంత రహస్యంగా ఉండాలి. అలాంటి సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేస్తున్నది ఎవరు?ధరణి నిర్వహకులే ఈ సమాచారాన్ని చేరవేస్తున్నారా? లేక కార్యాలయం చుట్టూ తిరిగే దళారుల పనా? లేక కార్యాలయంలోని సిబ్బందే ఈ తతంగానికి సహకరిస్తున్నారా? అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇది నిజమైతే ఇది ప్రభుత్వ గోప్యతకు భంగం కలిగించే తీవ్రమైన అంశం.

**జిల్లాధికారి స్పందించాలి:**

ఇలా సమాచారం బయటకు వెళ్లడం, నమోదు ప్రక్రియను కావాలనే ఆలస్యం చేయడం వల్ల సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఆడబిడ్డల హక్కులకు భంగం కలుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

పెద్దపల్లి జిల్లాధికారి కోయ శ్రీహర్ష వెంటనే స్పందించి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఓదెల తహసీల్దార్ కార్యాలయంలోని నమోదు పత్రాలను, గత నెల 29 నుండి జరిగిన వాయిదాల వివరాలను, సమాచారం బయటకు వెళ్లిన తీరును పరిశీలించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# డీసీలు ఉన్నా.. ఏసీలకే ఎందుకీ భారం? ఎండోమెంట్ శాఖలో అధికారుల కొరత

**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండోమెంట్ శాఖలో అధికారుల కొరత తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ఆ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాల స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సహాయ కమిషనర్లు (ఏసీలు) సిబ్బంది కొరత కారణంగా అదనపు పనిభారాన్ని మోయాల్సి వస్తోందని పలువురు అధికారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూపరింటెండెంట్లు, కార్యనిర్వహణాధికారులు, ఇన్‌స్పెక్టర్లు, క్లర్కులు పోస్టులు ఖాళీగా ఉండటంతో అందుబాటులో ఉన్న అధికారులపైనే అదనపు బాధ్యతలు పడుతున్నాయని చెబుతున్నారు.

జిల్లాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఆలయాల పరిపాలన, పర్యవేక్షణ, రికార్డుల పరిశీలన, ఆదాయ వ్యయాల వ్యవహారాలు, ఆలయ ఆస్తుల పరిరక్షణతో పాటు ఇతర శాఖాపరమైన పనులను ఏసీలు అదనంగా పర్యవేక్షించాల్సి వస్తోందని సమాచారం. ఒకే అధికారికి పలు బాధ్యతలు అప్పగించడంతో ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించేందుకు సమయం దొరకడం లేదని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా ఆలయాల్లో ఉత్సవాలు, జాతరలు, బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగే సమయంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని చెబుతున్నారు. ఒకేసారి పలు ఆలయాల్లో కార్యక్రమాలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు వాటి ఏర్పాట్లు, పరిపాలనా వ్యవహారాలు, ఆదాయ వ్యయాల పర్యవేక్షణ, అధికారిక కార్యక్రమాల సమన్వయం వంటి బాధ్యతలు పెరుగుతున్నాయని అంటున్నారు. తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రతి కార్యక్రమానికి సమయానికి చేరుకుని పర్యవేక్షించడం కూడా ఇబ్బందికరంగా మారుతోందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.ఇదిలా ఉండగా.. శాఖలో కీలక స్థాయిలో ఉన్న డీసీ అధికారుల పరిధిలోని బాధ్యతలు, క్షేత్రస్థాయిలో వారి పర్యవేక్షణపై కూడా ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాల్లో సిబ్బంది కొరతతో ఏసీలు అదనపు బాధ్యతలు మోస్తున్న పరిస్థితిలో ఉన్నతస్థాయిలో సమస్య పరిష్కారానికి తగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది లేక పనిభారం పెరుగుతున్నప్పటికీ ఖాళీల భర్తీ, బాధ్యతల పునర్విభజనపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని కొందరు అధికారులు గుసగుసలాడుతున్నారు.మరోవైపు పదోన్నతులు లేక పలువురు ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకే స్థాయిలో, ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారని సమాచారం. అర్హత ఉన్నప్పటికీ




పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదనే అసంతృప్తి ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఈ అంశం ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగుల్లో నిరాశ నెలకొన్నట్లు తెలుస్తోంది.అధికారుల కొరత కారణంగా ఆలయాల క్షేత్రస్థాయి పర్యవేక్షణపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆలయాలు, వాటి ఆస్తులు, ఆదాయ వనరులు, పరిపాలనా వ్యవహారాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఇన్‌స్పెక్టర్లు, ఈవోలు, క్లర్కులు తదితర స్థాయిల్లో ఖాళీలు ఉండటంతో అందుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎండోమెంట్ శాఖలో ఉన్న ఖాళీలను జిల్లాల వారీగా సమగ్రంగా గుర్తించి, అవసరమైన అధికారులు, సిబ్బందిని తక్షణమే నియమించాలని శాఖ వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఏసీలపై పడుతున్న అదనపు బాధ్యతలను తగ్గించడంతో పాటు సూపరింటెండెంట్లు, ఈవోలు, ఇన్‌స్పెక్టర్లు, క్లర్కులు తదితర పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదే సమయంలో అర్హత ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఎండోమెంట్ శాఖలో అధికారుల కొరతను కేవలం ఉద్యోగ ఖాళీల సమస్యగా కాకుండా ఆలయాల పరిపాలన, పర్యవేక్షణకు సంబంధించిన కీలక అంశంగా ప్రభుత్వం పరిగణించి సమగ్ర చర్యలు తీసుకోవాలని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

# గిరిజన కుటుంబాలకు 125 రోజుల ఉపాధికి తెలంగాణ సర్కార్ చర్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 23:**




ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమైంది. ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. జాబ్ కార్డులు లేని అర్హులైన గిరిజన కుటుంబాలకు కొత్త కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే ఎదీ-+ =ూవీ + పథకం కింద అర్హులైన కుటుంబాలకు 125 రోజుల ఉపాధి కల్పించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.జాబ్ కార్డుల్లో 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యులందరి పేర్లను నమోదు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో అర్హులైన గిరిజన కుటుంబాలను గుర్తించి, జాబ్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. కరవు పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా చూడటంతో పాటు, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులను నివారించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఉపాధి కల్పన, జాబ్ కార్డుల జారీపై జిల్లాల వారీగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# రాంలీలా కార్యక్రమంపై ఆరోపణలు అవాస్తవం

■ నిర్వాహకుడి వివరణ



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:దసరా సందర్భంగా హుజురాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాంలీలా, రావణ దహనం కార్యక్రమంపై బాణసంచా నాణ్యత విషయంలో వస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని నిర్వాహక బాధ్యుడు స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని ప్రజలు ఉత్సాహంగా వీక్షించారని, రావణ దహనం అసంపూర్తిగా జరిగిందనే విమర్శలు అవాస్తవమని పేర్కొన్నారు.బాణసంచా పేలుళ్ల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా బ్లాస్టింగ్ జోన్‌ను మూసివేసి, అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. చివరి పది నిమిషాల్లో పాత్రికేయులు, పాలకవర్గ సభ్యులు, అధికారులను ఆహ్వానించామని వివరించారు. విజయవంతంగా జరిగిన కార్యక్రమంపై అనవసర ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని కోరారు.

# మృతుడి కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక సాయం

హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజురాబాద్ పట్టణంలోని 25వ వార్డుకు చెందిన కమ్మరి వృత్తిదారుడు పవార్ గోపి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి అండగా నిలిచిన 25వ వార్డు కౌన్సిలర్ కొండ ప్రశాంతి మురళి దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్‌ను పలువురు అభినందించారు.



# సివిల్ ఆసుపత్రి ముందు మురికి కాలువలు చెత్తాచెదారం




■ దుర్వాసనతో రోగులకు తప్పని ఇబ్బందులు

హుజురాబాద్,జోర్ధార్ ప్రతినిధి:కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సివిల్ ఆసుపత్రి ముందు మురికి కాలువలు, పేరుకుపోయిన చెత్తాచెదారంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త పేరుకుపోవడంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు, చెత్తాచెదారాన్ని తొలగించి ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.

# హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత



■ ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్

చింతూరు,(ఏపీ స్టేట్ జోర్ధార్ బ్యూరో)హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్ అన్నారు. పోలవరం జిల్లా ఎస్పీ చక్రవర్తి, డీఎస్పీ ఉదయపావని ఆదేశాల మేరకు ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి, హెల్మెట్ లేని వారికి కొనుగోలు చేయించారు.

ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

# గ్రీన్ ఫీల్డ్ రహదారిని మార్చి

## అందరికీ ఆమోదయోగ్యమైన బ్రౌన్ ఫీల్డ్ రహదారి ఏర్పాటు చేయాలి

■ మంత్రి వివేక్, ఎర్ర వెల్లి రఘునాథులే, బాధ్యత వహించాలి.

■ న్యాయవాది వెంకటేష్ గుణ.



మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారి 63 ను ఏర్పాటు చేయడానికి 2018 లో గ్రీన్ ఫీల్డ్ రహదారిగా మార్చడానికి ప్రయత్నించగా, స్థానిక రైతులు అడ్డుకోవడంతో మార్చి, 23లో అందరికీ ఆమోదయోగ్యమైన బ్రౌన్ ఫీల్డ్ రహదారి ఏర్పాటు చేయడానికి నిర్ణయించారని, తిరిగి 2024 లో గ్రీన్ ఫీల్డ్ రహదారిగా మార్చు చేయగా, వందలాదిమంది రైతుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయని, గ్రీన్ ఫీల్డ్ రహదారిని రద్దు చేసి, బ్రౌన్ ఫీల్డ్ రహదారి ఏర్పాటుకే స్థానిక నాయకులు బిజెపి ఎర్రబెల్లి రఘునాధ రావు, మంత్రి వివేక్ వెంకట్ స్వామిలే, పూర్తి బాధ్యత వహించాలని ఎవి వెంకటేష్ గుణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బీసీ భవన్ లో, రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారూ, కొంతమంది రాజకీయ దళారులు చేసిన తప్పుడు పనుల వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రధానంగా 2018 లోని గ్రీన్ ఫీల్డ్ ను మార్చి ,2023లో ఏర్పాటు అయిన బ్రౌన్ ఫీల్డ్ అందరికీ ఆమోదయోగ్యమైనప్పటికీ, బ్రౌన్ ఫీల్డ్ ని, మార్చి 2024లో గ్రీన్ ఫీల్డ్ గా చేయడంతో వందలాది మంది రైతుల జీవితాలు ఆగమ్య గోచరంగా మారాయని అన్నారు. రైతులు ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన బాధిత రైతులని, వారిని కాపాడాలనే కనీస ధర్మం లేకుండా, ప్రస్తుత మంత్రి వివేక్ వెంకటస్వామి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్ రావు, ఈ ఇద్దరు లక్షెట్టిపేటలోని కార్పొరేట్ శక్తులకు తోడై, తోడేళ్ల లాగా రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు.

2023 బ్రౌన్ ఫీల్డ్ అలైన్మెంట్ ను, మార్చడంలో దాదాపు 8 నుండి 10 కోట్ల రూపాయలు చేతులు మారాయని పత్రికల్లో, టీవీ ఛానల్లో వార్తా కథనాలు వచ్చాయని, ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుందని, దీనికి పూర్తి బాధ్యత ఈ ఇద్దరు నాయకులే వహించాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకుడు రఘునాధరావు 2024 లో గ్రీన్ఫీల్డ్ గా మార్చడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి నాలుగు రెట్ల నిధులు దుర్వినియోగం అయితున్నాయని తెలిసినా, కనీస జ్ఞానం కూడా లేకుండా, స్వార్థ ప్రయోజనాల కోసం రోడ్డును మార్చడం ఏమిటని ప్రశ్నించారు. బిజెపి లోనే ఉంటూ తన జేబు నింపుకోవడం కోసం, రైతుల జీవితాలను పణంగా పెట్టి, సొంత పార్టీ, కేంద్ర ప్రభుత్వాన్నే తప్పుదారి పట్టించిన ఘనుడని అన్నారు.

కోర్టు రైతులకు అండగా నిలిచినప్పటికీ, కార్పొరేట్ శక్తులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి కోర్టు తీర్పు పై అప్పీల్ కి వెళ్ళి "స్టే" తీసుకు వచ్చారని, ఏడుసార్లు పార్టీలు మార్చిన వివేక్ వెంకట్ స్వామి చేసిన ద్రోహపూరితమైన పనికి, స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అతని తనయుడు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వంశీ, మంచిర్యాల నియోజకవర్గంలో ఆధిపత్య పోరు రాజకీయాలు మానుకొని, మంచిర్యాల నియోజకవర్గంలో తీవ్రంగా నష్టపోతున్న రైతులకు న్యాయం చేసే విధంగా, ఎన్ హెచ్ ఏ ఐ అధికారులతో మాట్లాడి, 2023 బ్రౌన్ ఫీల్డ్ ద్వారా రహదారి నిర్మాణం జరిగేలా, కృషి చేయాలని డిమాండ్ చేశారు.

స్థానిక శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు కు, ఓటేసిన రైతులు సర్వం కోల్పోతున్న, వారి పక్షాన ఎందుకు నిలబడటం లేదని, ఒకపక్క అధికారులు అవార్డు పాస్ చేయడానికి తాపత్రయపడుతున్నారని, దాన్నీ అడ్డుకొని గ్రీన్ ఫీల్డ్ రోడ్డును ఆపివేయాల్సిన బాధ్యత మీపై లేదా అని ప్రేమ్ సాగర్ రావు ను ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో ఎం.వెంకటేష్ గుణ, రైతులు కస్తూరి మల్లేష్, వొడ్నాల శ్యాంసుందర్, ఉస్మాన్ పాష , సాంబారి అశోక్, సాంబారి తిరుపతి, నైనాల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# లద్నాపూర్ ఆలయంలో లక్కీ డ్రా విజేతకు ఎలక్ట్రిక్ స్కూటీ అందజేత

■ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం



రామగిరి జోర్దార్ ప్రతినిధి:రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలోని శ్రీ గోదా రంగనాయక స్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా ఎలక్ట్రిక్ స్కూటీని గెలుచుకున్న మోత్కూరి రాజు గౌడ్‌కు కమిటీ సభ్యులు స్కూటీని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు, శ్రీ గోదా రంగనాయక స్వామి దాసాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బర్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ తాళ్లపెల్లి కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.అలాగే ఆలయ కమిటీ సభ్యులు గాజు రఘుపతి, ఎడ్ల సంతోష్, తొట్ల ఓదెలు, చిప్ప వెంకన్న, తొగరి స్వామి, అరిగల శ్రీకాంత్, గాజు తిరుపతి, తొట్ల మహేష్, ఎస్‌కే అల్లి, బర్ల శ్రీకాంత్‌తో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



■ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రం,గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు గణితంపై ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు.

పాఠశాలలకు పెయింటింగ్ వేయించి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ఎస్ఎస్‌సీ పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల



హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి)తెలంగాణలో మార్చి 2027లో నిర్వహించనున్న ఎస్ఎస్‌సీ, ఓఎస్‌-ఎస్‌సీ, వొకేషనల్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదలైనట్లు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్వీ గిరిరాజ్ గౌడ్ తెలిపారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 16 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 18 నుంచి డిసెంబర్ 1 వరకు, రూ.200 రుసుముతో డిసెంబర్ 3 నుంచి 14 వరకు, రూ.500 రుసుముతో డిసెంబర్ 16 నుంచి 28 వరకు చెల్లించవచ్చన్నారు.మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మూడు సబ్జెక్టులకు మించి రూ.125 పరీక్ష ఫీజు నిర్ణయించారు. వొకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలి. ప్రధానోపాధ్యాయులు [bse.telangana.gov.in](https://www.bse.telangana.gov.in) వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించాలని సూచించారు. విద్యార్థుల వివరాలను అడ్మిషన్ రిజిస్టర్,యూడైస్ ప్లస్ రికార్డులతో సరిచూసి సమర్పించాలని, గడువులోగా ఫీజు చెల్లింపులు పూర్తి చేయాలని తెలిపారు.మరిన్ని వివరాలకు సహాయ సంచాలకులు ఎ. మధుసూధన్ రావును సంప్రదించాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి

## ఇద్దరు అంధులకు చూపునిచ్చిన అరవింద్ కల్యాణ్ నేత్రాలు!

■ నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ అభినందనలు



రామగిరి, జోర్దార్ ప్రతినిధి:పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన ముత్తె అరవింద్ కల్యాణ్ (32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినప్పటికీ, ఆయన నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించారు. ఈ విషాద సమయంలో నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు.అక్టోబర్ 22న హన్మకొండలో జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో అరవింద్ కల్యాణ్ మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన సమీప బంధువు లగిశెట్టి రాజకిశోర్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఎల్వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో అరవింద్ కల్యాణ్ కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంకుకు పంపించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు పొందే అవకాశం కలిగింది.మరణించిన వ్యక్తి నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చిన తల్లిదండ్రులు ముత్తె కళ్యాణి, చంద్రమౌళి, సోదరుడు ముత్తె సుమన్‌ను బంధుమిత్రులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించిన లగిశెట్టి రాజకిశోర్‌ను ప్రశంసించారు.ఈ సందర్భంగా సందేల కుమార్, కాట సది గౌడ్ శివ, బొడ్డు రవీందర్, దూండే రాజయ్య, కాసర్ల శ్రీను, రాజేశం, కరస్పాండెంట్ తిరుపతి రెడ్డి, బర్ల శ్రీనివాస్ తదితరులు దివంగత అరవింద్ కల్యాణ్‌కు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు లగిశెట్టి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి రాజమౌళి, కె. సమ్మయ్య తదితరులు నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.ఒకరి మరణం మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేలా చేసిన ఈ నేత్రదానం, సమాజంలో నేత్రదానంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని చాటిచెప్పింది.

# హిందూ సంస్కృతి రక్షణకే అలయ్ బలయ్ కార్యక్రమం



■ బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:హిందూ సంస్కృతి రక్షణకే అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించామని, బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి అన్నారు.

శుక్రవారం స్థానిక అగర్వాల్ భవన్ లో బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందనీ, బెల్లంపల్లి పట్టణంలో మొదటి సారి ఈ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సీనియర్ నేత, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లో అన్ని వర్గాలు, కులాలు, మతాలు, పార్టీలు, సంఘాలను కలుపుకొని అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు.

అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కండువాలు కప్పి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, పులగం తిరుపతి, భరత్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, రామయ్య యాదవ్, గోవర్ధన్, ఆకుల శంకర్, నర్సింగ్, కల్లేపల్లి నవీన్, యుగంధర్, గణేష్, రాజ్ కుమార్, రాములు, స్వామి, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది



■ 53 లక్షల విలువైన 153 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ,కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం హుజురాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ పట్టణం, మండలంతో పాటు కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.53 లక్షల విలువైన 153 ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం తప్ప కౌశిక్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ప్రయోజనాలెన్నో

మన శరీరానికి కావల్సిన పోషకాల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఒకటి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఇవి ముఖ్యంగా సముద్రపు చేపల్లో ఎక్కువగా ఉంటాయి. అయితే పలు రకాల శాకాహారాల్లోనూ ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మనకు లభిస్తాయి. అవిసె గింజలు, అవకాడో, చియా విత్తనాలు, బాదంపప్పు, ఆలివ్ ఆయిల్, జొన్నలు, రాగులు, కొర్రలు, అరికలు, ఊదలు, సామలు వంటి చిరుధాన్యాల్లోనూ మనకు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా లభిస్తాయి.

అందువల్ల వీటిని ఆహారంగా తీసుకుంటే మనం ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లను పొందవచ్చు. వీటి వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి.

1. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుత తరుణంలో చాలా మంది డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళనతో సతమతం అవుతున్నారు. అలాంటి వారు రోజూ ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళన నుంచి బయట పడవచ్చు. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

2 ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు పెరుగుతుందని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆహారాల వల్ల కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. కంటి సమస్యలు తగ్గుతాయి.

3గర్భిణీలు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు అత్యంత తెలివిమంతులు అవుతారని సైంటిస్టులు




చెబుతున్నారు. ఈ ఆహారాల వల్ల పిల్లల్లో మెదడు చాలా యాక్టివ్‌గా పనిచేస్తుంది. దీంతో వారు చదువుల్లో అద్భుతంగా రాణిస్తారు. కమ్యూనికేషన్, సోషల్ స్కిల్స్ పెరుగుతాయి. వారిలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరగడంతోపాటు మానసిక సమస్యలు రాకుండా ఉంటాయి.

4. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. గుండె ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుంది.

5. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను రోజూ తీసుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్‌లు రాకుండా చూసుకోవచ్చు. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది. షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి.

6. శరీరంలో వాపులు అధికంగా ఉన్నవారు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకుంటే వాపులతోపాటు నొప్పులు కూడా తగ్గిపోతాయి. కీళ్ల నొప్పులు ఉండే వారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం.

7. వయస్సు మీద పడితే ఎవరికైనా మతిమరుపు, జ్ఞాపకశక్తి తగ్గుదల వంటి సమస్యలు వస్తాయి. కానీ ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకుంటుంటే ఆయా సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చు. వృద్ధాప్యంలోనూ మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

8. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల పలు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు 55 శాతం వరకు తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

9. చిన్నారులకు ఈ ఆహారాలను ఇవ్వడం వల్ల వారిలో శ్వాస కోశ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా ఆస్తమా ఉన్నవారికి ఉపశమనం లభిస్తుంది.

10. లివర్ సమస్యలు ఉన్నవారు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను తీసుకుంటే లివర్ క్లీన్ అవుతుంది. అందులో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది.

11. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. నెలసరి సమయంలో స్త్రీలకు వచ్చే సమస్యలను తగ్గిస్తాయి.

12. నిద్రలేమి సమస్యలు ఉన్నవారు రోజూ ఈ ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి మనస్సు ప్రశాంతంగా మారుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు.

13. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. చర్మంపై ఉండే గజ్జి, దురద, దద్దుర్లు తగ్గిపోతాయి. చర్మం పగలకుండా మృదువుగా, తేమగా ఉంటుంది.

చేపలు, బాదంపప్పు, అవిసె గింజలు, చియా విత్తనాలు, చిరు ధాన్యాలను రోజూ తీసుకోవడం వల్ల ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మనకు లభిస్తాయి. అయితే వైద్యుల సూచన మేరకు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు చెందిన ట్యాబ్లెట్లను వాడవచ్చు.

సాధారణంగా పెద్దలకు రోజుకు 250 నుంచి 500 మిల్లీగ్రాముల మేర ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అవసరం అవుతాయి. ఈ పోషక పదార్థ లోపం ఉంటే వైద్యులు రోజుకు 1.1 గ్రాముల నుంచి 1.6 గ్రాముల మోతాదులో ట్యాబ్లెట్లను ఇస్తారు. వీటిని నెల రోజుల పాటు వాడాల్సిందిగా డాక్టర్లు సూచిస్తుంటారు. ఇక చిన్నారులకు రోజుకు 50 నుంచి 100 మిల్లీగ్రాముల మోతాదులో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అవసరం అవుతాయి. ఇవి ఉండే ఆహారాలను రోజూ తీసుకుంటూ వైద్యుల సూచన మేరకు ట్యాబ్లెట్లను వాడుకుంటే పైన తెలిపిన ప్రయోజనాలను పొందవచ్చు.

**కామిడి సతీష్ రెడ్డి**
**జయ శంకర్ భూపాల్ పల్లి జిల్లా**

# ఆదిలాబాద్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

## క్వింటాలుధర రూ.9,260



**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో శుక్రవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు వ్యాపారులు తొలిరోజు క్వింటాలు పత్తిని రూ.9,260కు కొనుగోలు చేసేందుకు నిర్ణయించడంతో రైతులకు కొంత ఊరట లభించింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కనీస మద్దతు ధరను రూ.8,667గా నిర్ణయించగా, తేమ శాతం నిబంధనలపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పత్తికి క్వింటాలుకు రూ.10 వేల ధర కల్పించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రాంతీయ ఉపసంచాలకురాలు పద్మావతి కొనుగోళ్లను ప్రారంభించారు.

జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాలు, 29 జిన్నింగ్ ఫ్యాక్టరీలను సిద్ధం చేశారు.

తొలిరోజు సుమారు 1,500 క్వింటాళ్ల పత్తిని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ ఏడీ గజా నన్ తెలిపారు.

రైతులు నాణ్యమైన పత్తిని తీసు కువచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ సూచించారు.

# “ సర్” పేరుతో ఓట్ల తొలగింపును ఆపాలి !




■ సి ఈ ఆర్ జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుండి తొలగించాలి.

■ సిఐటియు నాయకుల డిమాండ్.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**“ సర్ “ పేరుతో ఓట్ల తొలగింపును ఆపాలనీ, సి ఈ ఆర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుండి తొలగించాలనీ, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై నిర్బంధం ఆపాలనీ, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు మండల కేంద్రంలోని ఐబి జాతీయ రహదారిపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐటియు నాయకులు దాగం రాజారాం మాట్లాడుతూ,

”సర్” పేరుతో 13 కోట్ల మందికి పైగా ఓట్లను ఏకపక్షంగా తొలగించడాన్నీ వ్యతిరేకిస్తున్నామని, తక్షణమే సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల శంకర్, సువర్ణ, లీలారాణి, కె విజయ లక్ష్మి, ఎం విజయ లక్ష్మి, రాజేశ్వరి, సుజాత, తిరు మలేశ్వరి, జైనేని లక్ష్మి,కామెర బాబు, మొగిలి, బొల్లం రాజేశం, కేసూరి, తదితరులు పాల్గొన్నారు.

# నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగంపై అధికారులు సూచనలు చేశారు. నేల సారాన్ని కాపాడుకుంటూ సమతుల్య ఎరువులు వినియోగించడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శివనాగిరెడ్డి, బి. జగునాయక్, మండల వ్యవసాయ అధికారి జి. రాధ, మండల విస్తరణ అధికారి చంద్రకళ, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ




**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**ఇంద్రవెల్లి మండల కేంద్రంలో గిరిజన యోధుడు కొమురం భీం కాంస్య విగ్రహా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు.ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆదివాసీలు భారీగా తరలివచ్చి అమరవీరుల స్థూపం నుంచి కొమురం భీం విగ్రహ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆదివాసీ ప్రజలు,వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,

తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా.అరుణ్ కుమార్, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కమలాపూర్ (జోర్దార్ ప్రతినిధి)**కమలాపూర్ మండలంలోని 12 గ్రామాల్లో వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న అర్హులైన లబ్ధిదారులకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. ఈ ఆర్థిక సాయం పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, మాజీ జడ్పీటీసీ నవీన్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జావీద్,సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్నానానికి వెళ్లి మృత్యుఒడిలోకి పంచాయతీ కార్యదర్శి దుర్మరణం!

■ ఓడేడు వాగు వద్ద విషాదం.. గుంతలో పడి జయపాల్ మృతి



**ముత్తారం జోర్దార్ ప్రతినిధి:**సరదాగా స్నానం చేసేందుకు వెళ్లిన పంచాయతీ కార్యదర్శికి మృత్యువు ఎదురైంది. ఓడేడు వాగు వద్ద రోడ్డుపై తవ్విన గుంతలో పడి శనిగరపు జయపాల్ మృతి చెందినట్లు సమాచారం. ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే.. సురాయపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జయపాల్.. రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎక్స్ రోడ్ పెట్రోల్ బంకు ఎదురుగా నివాసం ఉంటున్నారు. భార్యతో కలిసి టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఓడేడు వాగు వద్దకు చేరుకున్నారు.అక్కడ రోడ్డుపై తవ్విన పెద్ద గుంతలో నీరు నిలిచి ఉండటంతో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి జయపాల్ మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఆయన భార్యను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.రోడ్డుపై తవ్విన గుంతలో పడి పంచాయతీ కార్యదర్శి ప్రాణాలు కోల్పోవడం విషాదాన్ని నింపింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:**ఆదిలాబాద్ కోర్టు ఆవరణలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తనకు సత్వర న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రాజు అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకుప్రయత్నించాడు. అప్రమత్తమైన అక్కడి వారు వెంటనే అతడిని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.నిర్మల్ జిల్లా కుంటాల మండలానికి చెందిన రాజు, కుల బహిష్కరణకు సంబంధించిన సమస్యపై న్యాయం కోసం కోర్టు చుట్టూ తిరుగుతున్నప్పటికీ పరిష్కారం లభించడం లేదనే మనస్తాపంతో ఈ చర్యకు పాల్పడినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వార్డుల సమస్యల పరిష్కారానికి చర్యలు



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ధర్మ తెలిపారు. స్థానిక నాయకుడు అజయ్ కుమార్‌తో కలిసి వివిధ వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా 5, 6వ వార్డుల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించడంతో పాటు తాగునీరు, సీసీ రోడ్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

# నూతన ఎస్ఐ గోవర్ధన్‌కు బీజేపీ నాయకుల శుభాకాంక్షలు

**చెన్నారావుపేట జోర్దార్ ప్రతినిధి:**మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన పొన్నాల గోవర్ధన్‌ను చెన్నారావుపేట మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సంగెం శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దుంకా దువ్వ రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి మురహరి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు కాందాల చంద్రమౌళి,

విజయకుమార్, మండల కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వీరు నాయక్, ఓబీ సీ మోర్చా మండల అధ్యక్షుడు వీరమల్ల మహేం దర్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తి యాశశిందర్, సీనియర్ నాయకులు మెరుగు కుమారస్వామి, కర్రే సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక "సర్"ప్రక్రియను బేషరతుగా రద్దు చేయాలి

- సి ఈ ఆర్ జ్ఞానేశ్ కుమారును వెంటనే పదవి నుండి తొలగించాలి.
- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన కొండు బానేష్, లాల్ కుమార్ లు,



**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**ప్రజా వ్యతిరేక సర్ ప్రక్రియను బేషరతుగా రద్దు చేయాలని, సి ఈ ఆర్ జ్ఞనేష్ కుమార్, ను వెంటనే పదవి నుండి తొలగించాలని, మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యకు ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి కొందు బానేష్, లాల్ కుమార్ లు, శుక్రవారం వినతి పత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోనీ బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న తప్పుడు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన వాళ్లను, ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీకి చెందిన అర్హులైన వాళ్ళ ఓట్లను అక్రమంగా తొలగించే కుట్రలకు పాల్పడుతుందని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా అర్హులైన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించడానికి పూనుకున్నదని, రాజ్యాంగానికి లోబడి, స్వతంత్రంగా ఉండాల్సిన ఎన్నికల కమిషనర్ బిజెపి కి కార్యకర్తగా, నాయకునిగా వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరంగా ఉందని, ఒకప్పుడు గ్రామీణ, పట్టణ పరిసర ప్రాంతాలలో ప్రజలను ఓటు విషయంలో ఎడ్యుకేట్ చేస్తూ ఓటర్ నమోదు చేయించిన పరిస్థితి నుండి బిజెపి అధికారంలోకి వచ్చాక అర్హులైన ఓట్లను, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారనే దుర్మార్గమైన చర్యకు పూనుకుంటుందని, ఇప్పటికే 20 కోట్లకు పైగానే అర్హులైన వాళ్ల ఓట్లను జాబితా నుండి తొలగించారని, దీనంతటికీ కారణం ఒక ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న ఎన్నికల కమిషనర్ కేంద్ర ప్రభుత్వానికి ఏజెంటుగా, కీలుబొమ్మగా మారి కోట్లల్లో అర్హులైన ఓటర్లను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అందుకే ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను, తక్షణమే పదవి నుండి తొలగించాలని, సర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, తొలగించిన ఓటర్లను ఎలాంటి షరతులు విధించకుండా ఓటర్ జాబితాలో చేర్చాలని, సంయుక్త కిషన్ మోర్చా ( ఎస్ కే యం ) రైతు సంఘాలు, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలోబోడెంకి చందు, గోగర్ల శంకర్,ప్రకాష్,ఇందారపు రాజేష్,దొండ ప్రభాకర్, మహేష్, రాములు, ప్రేమ్ కుమార్, వేల్పుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన అభ్యర్థులుగా సోడే రమాదేవి
## బట్టు అరుణకుమారి నామినేషన్లు





**చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో)**కూనవరం మండలంలోని చినార్కూర్, కూనవరం–2 సెగ్మెంట్ల నుంచి టీడీపీ, బీజేపీ మద్దతుతో జనసేన పార్టీ అభ్యర్థులు సోడే రమాదేవి, బట్టు అరుణకుమారి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని అభ్యర్థులు తెలిపారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దాసరి నరేంద్ర కుమార్, అరకు పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు మచ్చ వినయ్ ప్రసాద్, కూనవరం మాజీ వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, కుంజా అనిల్, సోడే ముత్తయ్య, మడివి కామయ్య, శ్యామల లింగారావు, శ్యామల రామిశెట్టి, తాటి రాంబాబు, వంజం లక్ష్మణ్, వెట్టి సురేష్, ముచ్చిక చంద్రావు, ముచ్చిక రాముడు, శ్యామల కన్నయ్య, తుష్టి రమేష్, శ్యామల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 26న రైల్వే మజ్దూర్ యూనియన్ నిరాహార దీక్ష

- యూనియన్ నాయకులు యుగంధర్ యాదవ్ ప్రకటన



**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:**రైల్వే రన్నింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని హ్యాండిక్యాప్డ్ , పైలట్ సెక్షన్లకు తక్షణమే ఆమోదం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ , సికింద్రాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో 2026 అక్టోబర్ 26, సోమవారం, సికింద్రాబాద్‌లోని సంచలన్ భవన్ వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు యుగంధర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.
డివిజన్ పరిధిలోని వివిధ సెక్షన్లకు సంబంధించి హ్యాండిక్యాప్డ్ , పైలట్ సెక్షన్ల ఆమోదం కోసం ప్రతిపాదనలను డివిజన్ అధికారులు ఇప్పటికే హెడ్‌క్వార్టర్స్‌కు పంపించారు. వీటిలో 11 సెక్షన్లకు 21 అక్టోబర్ న ఆమోదం లభించినప్పటికీ, మిగిలిన పెండింగ్ సెక్షన్లకు ఇంకా ఆమోదం లభించకపోవడం పట్ల యూనియన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అన్ని అర్హత కలిగిన సెక్షన్లకు సమాన న్యాయం జరిగేలా, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలన్నింటినీ అధికారులు వెంటనే పరిశీలించి ఆమోదం మంజూరు చేయాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది. రన్నింగ్ సిబ్బంది విధుల స్వభావం, పని ఒత్తిడి, విశ్రాంతి అవసరాలు, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వే యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోవాలని యుగంధర్ యాదవ్ కోరారు.
లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు తదితర రన్నింగ్ సిబ్బంది రైళ్ల సురక్షిత నిర్వహణలో అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారి పని పరిస్థితులను మెరుగుపరచడం, న్యాయమైన హక్కులను కల్పించడం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం రైల్వే యాజమాన్య బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.
అదేవిధంగా, ప్రతి సైన్–ఆన్ నుంచి సైన్–ఆఫ్ వరకు కనీసం 120 కిలోమీటర్ల అలవెన్స్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. రన్నింగ్ సిబ్బందికి న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ నిరాహార దీక్షలో లోకో, ట్రాఫిక్ శాఖలకు చెందిన రన్నింగ్ సిబ్బందితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, యూనియన్ డివిజనల్ కార్యవర్గ సభ్యులు, బ్రాంచ్ కార్యదర్శులు, బ్రాంచ్ చైర్మన్లు, ఇతర యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళా రన్నింగ్ సిబ్బంది కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
పెండింగ్‌లో ఉన్న అన్ని సెక్షన్లకు ఆమోదం సాధించడం, రన్నింగ్ సిబ్బంది సమస్యలను యాజమాన్యం దృష్టికి బలంగా తీసుకెళ్లడం ఈ నిరాహార దీక్ష ప్రధాన ఉద్దేశమని యుగంధర్ యాదవ్ స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలబడి ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
"ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గం. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హత కలిగిన హ్యాండిక్యాప్డ్ , పైలట్ సెక్షన్లకు తక్షణమే ఆమోదం కల్పించాలి. రన్నింగ్ సిబ్బందికి న్యాయం జరిగే వరకు యూనియన్ తమ పోరాటాన్ని కొనసాగిస్తుంది" అని మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు యుగంధర్ యాదవ్ పేర్కొన్నారు.

# అనుమతి లేకుండా
## బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

- వ్యాపారులు తప్పనిసరిగా అనుమతి పొందాలి ఇన్‌స్పెక్టర్ మహేందర్



**హసన్ పర్తి,(జోర్దార్ ప్రతినిధి)**దీపావళి పండుగను పురస్కరించుకొని పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ముందస్తు అనుమతులు లేకుండా టపాసులు,బాంబులు నిల్వ ఉంచినా,విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హసన్ పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పలు సూచనలు చేశారు.
దీపావళి సందర్భంగా ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.పటాకుల విక్రయాలు చేపట్టాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు, పొందిన తర్వాతే విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు.అనుమతి లేని ప్రదేశాల్లో,నివాస ప్రాంతాల మధ్య బాణసంచాను నిల్వ ఉంచడం నిషిద్ధమని పేర్కొన్నారు.నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా పటాకులు,బాంబులు నిల్వ ఉంచడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తారని తెలిపారు.అక్రమ నిల్వలు గుర్తించినట్లయితే బాణసంచాను స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.
ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ దీపావళి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు.

# పేదల వైద్యానికి భరోసా..
# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ!

- వీణవంక మండలంలో 31 మందికి రూ.10.50 లక్షల ఆర్థిక సాయం
- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు




**(హుజురాబాద్/జమ్మికుంట/వీణవంక జోర్దార్ ప్రతినిధి)** అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. వీణవంక మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబును ఆశ్రయించగా, ఆయన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ప్రభుత్వానికి దరఖాస్తులు పంపించారు. ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.
వీణవంక మండలంలోని 19 గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.10,50,500 విలువైన చెక్కులను ఒడితల ప్రణవ్ బాబు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనివ్వనుంది.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, సర్పంచులు జడల శ్రీకాంత్,దూడపాక శ్రీవాణి–రాజు, అందె శ్రీమతి–కుమార్, నాయకులు కొమ్మిడి రాకేష్ రెడ్డి, అలె మధుసూదన్, చదువు జైపాల్ రెడ్డి, డైరెక్టర్ కామిడి శ్రీపతి రెడ్డి, సునీల్, మాజీ సర్పంచులు పంజాల సతీష్,మ్యాక వీరయ్య, పానుగంటి మధుకర్,చిన్నాల ఐలయ్య,మందారపు నరేష్, గ్రామ అధ్యక్షులు ఎల్కపల్లి లక్ష్మణ్, బండారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్నారు..
## "స్వేచ్ఛ ఆడబిడ్డ" పథకం ప్రారంభం



**(జమ్మికుంట: జోర్దార్ ప్రతినిధి)**కొంత మంది నేతల హామీలు నీటి మూటలుగా మారుతున్న ప్రస్తుత తరుణంలో.. అందుకు భిన్నంగా ఇచ్చిన హామీలను ఆచరణలో నిలబెట్టుకునే నాయకులు అరుదు అని చెప్పొచ్చు. ఆ కోవకు చెందిన వారే జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామ ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు "స్వేచ్ఛ ఆడబిడ్డ" పేరిట ఆడబిడ్డ పుట్టిన కుటుంబానికి రూ.2,016 ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నాటి మాటను (శుక్రవారం) నిలబెట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు ఆడ బిడ్డలకు రూ.2,016 చొప్పున అంబాల రజనీకాంత్ జన్మదినం సందర్భంగా అందజేశారు. ఆడపిల్ల జన్మను గౌరవిస్తూ, ఆడబిడ్డల పట్ల సమాజంలో గౌరవాన్ని పెంపొందిస్తూ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే గొప్ప ఆశయంతో "స్వేచ్ఛ ఆడబిడ్డ పథకాన్ని" ఉపసర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్ ప్రారంభించడం పట్ల సర్పంచ్ జక్కె కిరణ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. "స్వేచ్ఛ ఆడబిడ్డ" వాల్ పోస్టర్ ను అందరూ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అంబాల రజనీకాంత్ మాట్లాడుతూ...
ఆడపిల్ల అంటే భారం కాదు... ఒక కుటుంబానికి వరం, సమాజానికి గర్వకారణం అని, ప్రతి ఆడబిడ్డకు గౌరవం, ప్రేమ, సమాన అవకాశాలు అందాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు.ఆడపిల్ల పుట్టుకను గౌరవించే ఆలోచన మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని, ఈ పథకం ఆడబిడ్డల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామనీ పేర్కొన్నారు.ఆడబిడ్డను గౌరవిద్దాం... ఆడబిడ్డను ఆదరిద్దాం...
ఆడపిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం అని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఆఫీసుకు " గ్రామ పంచాయతీ కార్యాలయం" పేరిట బోర్డు ను సైతం ఉప సర్పంచ్ దంపతులు బహూకరించారు. కార్యక్ర మంలో సర్పంచ్ కిరణ్ జక్కే, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భువనేశ్వర్‌లో జాతీయ పట్టణ
## సదస్సుకు కమిషనర్ వెంకన్న

**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)**ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో అక్టోబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న లి2వ జాతీయ పట్టణ సదస్సు--2026లికు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న హాజరుకానున్నారు.
రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి ఆయనను సదస్సుకు నామినేట్ చేశారు.



ఈ సదస్సులో తెలంగాణలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొననున్నారు.
పట్టణాభివృద్ధి, నీటి నిర్వహణ, వ్యర్థాల నియంత్రణ, మౌలిక సదుపాయాలు, మెరుగైన పౌర సేవలపై జరిగే చర్చలు వరంగల్ నగర అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి.

# సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ



**వికారాబాద్(జోర్దార్ ప్రతినిధి)**వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశంతో కలిసి రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ, 25 కిలోల శనగ విత్తనాల బస్తా ధర రూ.2,500 కాగా, ప్రభుత్వం రూ.1,000 సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. రైతులు రూ.1,500 చెల్లించి ఒక బస్తా పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏవో ప్రసన్నలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రంగారెడ్డి, ఏఈవో రమాదేవి, రైతులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు కమలాపూర్ మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ.8,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ, పేదల వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో బాలసాని రమేష్, మాజీ ఎంపీపీలు మాట్ల రమేష్, తడక శ్రీకాంత్, పోడేటి బిక్షపతి, బొల్లం రాజారెడ్డి, మొండెద్దుల నాగరాజు, పుల్ల శోభన్, నాంపల్లి ప్రభాకర్, మార్కెట్ డైరెక్టర్లు ఆకినపల్లి బిక్షపతి, జనగాని శివకృష్ణ, మిల్కూరి శ్రీనివాస్, గూడెపు మొగిలయ్య, నల్లాని సురేష్, గణేష్, బాలాపూర్ కనకరత్నం, తిప్పారపు యుగేందర్, బెజ్జంకి రాజు, వసంతారావు తదితరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

శనివారం,
అక్టోబర్ 24 2026



# చెన్నారావుపేట నూతన ఎస్ఐకి

## బీజేపీ నాయకుల అభినందనలు



■ ఎస్ఐ పొన్నాల గోవర్ధన్‌కు పుష్పగుచ్ఛం అందజేత

**చెన్నారావుపేట, జోర్దార్ ప్రతినిధి:**చెన్నారావుపేట మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన పొన్నాల గోవర్ధన్‌ను మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఎస్ఐ గోవర్ధన్ విజయవంతంగా ముందుకు సాగాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరుకున్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సంగెం శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దుంకాదువ్వ రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి మురహరి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు కాందాల చంద్రమౌళి, విజయకుమార్, మండల కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వీరు నాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వీరమల్ల మహేందర్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తియా శశిందర్, సీనియర్ నాయకులు మెరుగు కుమారస్వామి, కర్రె సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై పప్పు శనగ విత్తనాలు

**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**యాసంగి సాగు కోసం తెలంగాణ ప్రభుత్వం రాయితీపై పప్పు శనగ విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. అయిజ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎన్‌బీఈజీ 47 రకం విత్తనాల పంపిణీ చేపట్టనున్నారు. 25 కిలోల ప్యాకెట్ ధర రూ.1,500 కాగా, ప్రస్తుతం 165 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. విత్తనాలు పొందాలనుకునే రైతులు శనివారం (అక్టోబర్ 24) ఉదయం 11 గంటలకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో అయిజ మండల వ్యవసాయ కార్యాలయానికి చేరుకొని సంబంధిత ఏఈఓను సంప్రదించాలని సూచించారు.

# భద్రతా ఆవిష్కరణల్లో

## ఎన్‌టీపీసీ తెలంగాణకు అవార్డు!




■ న్యూఢిల్లీలో సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు--2026 ప్రదానం

■ 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సులో లభించిన గౌరవం

**(రామగుండం, జోర్దార్ ప్రతినిధి)**భద్రతా ప్రమాణాల అమలు, వినూత్న భద్రతా విధానాల రూపకల్పనలో విశేష కృషి చేస్తున్న ఎన్‌టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. భద్రతా ఆవిష్కరణల విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన 'సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు-2026'ను ఎన్‌టీపీసీ తెలంగాణ అందుకుంది.
న్యూఢిల్లీలోని లోధి రోడ్డులో ఉన్న ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో అక్టోబర్ 23న ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్--ఎస్క్యూఎఫ్ (IEI-SQF) ఆధ్వర్యంలో నిర్వహించిన 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సు--2026లో ఈ అవార్డును ప్రదానం చేశారు.
ఎన్‌టీపీసీ తెలంగాణ తరపున అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఈఎండీ) రజనీష్ చంద్ర సన్యాల్, సీనియర్ మేనేజర్ (భద్రత) ఏ.వి.ఎన్. రెడ్డి ఈ అవార్డును స్వీకరించారు.

విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, వినూత్న భద్రతా విధానాలను అమలు చేయడం, ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడం, నిరంతరం భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడంలో ఎన్‌టీపీసీ తెలంగాణ చూపుతున్న నిబద్ధతకు ఈ పురస్కారం నిదర్శనంగా నిలిచింది.
సంస్థలోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు సమష్టిగా చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపునిచ్చింది. భద్రతకు సంబంధించిన ఉత్తమ పద్ధతులను ప్రోత్సహిస్తూ, ప్రమాదరహిత పని వాతావరణాన్ని నిర్మించాలనే సంస్థ లక్ష్యానికి ఈ విజయం మరింత ప్రోత్సాహాన్నివ్వనుంది.
'భద్రతే ప్రథమం.. ఎల్లప్పుడూ.. ప్రతిచోటా' అనే నినాదానికి కట్టుబడి పనిచేస్తున్న ఎన్‌టీపీసీ తెలంగాణకు ఈ అవార్డు గర్వకారణంగా నిలిచింది.

# బుచ్చమ్మ వైద్యానికి రూ.2.25 లక్షల ఎల్‌ఓసీ మంజూరు

■ అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆర్థిక భరోసా

**(వీణవంక జోర్దార్ ప్రతినిధి)**వీణవంక మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి బుచ్చమ్మ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్సీ, విప్ బల్మూరి వెంకట్ రూ.2,25,000 విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఓసీ మంజూరుకు సహకరించిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు బుచ్చమ్మ కుమారుడు కోమల్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబానికి తక్షణమే స్పందించి ఆర్థిక భరోసా కల్పించిన ఎమ్మెల్సీకి మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




GOVERNMENT OF TELANGANA
Ph: 040- 69049966
Fax: 040- 690-23459544
CHIEF MINISTER'S OFFICE
Lr. No.1469/CMR/LOC/2026, Dt:22-10-2026
To
The Director,
NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.
Sir,
Sub:- CMRF- Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of Individual - Reg.
Ref:- 1. Letter from the SRT DR. VENKAT NARSING RAO BALMOOR, Hon'ble MLC - GOVT WHIP, dt.22-10-2026.
@@@
The Hon'ble Chief Minister desires that the treatment of Smt Chintireddy Buchamma, W/o Sri Bukkareddy, Hn-1-2, Desayipalli, to be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs.2,25,000/-(Rupees Two Lakh Twenty Five Thousand Only) to undergo Right FCR.
Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.
Yours sincerely,
( Vemula Srinivasulu )
Copy to:
SRI DR. VENKAT NARSING RAO BALMOOR,
Hon'ble MLC - GOVT WHIP
Copy to:
Smt Chintireddy Buchamma,
W/o Sri Bukkareddy,
Hn-1-2, Desayipalli,
Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

# కరీంనగర్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా

## ఎర్రబెల్లి సంపత్ రావుకు మరోసారి అవకాశం

■ గండ్రపల్లి గ్రామం నుంచి జిల్లా స్థాయి నాయకత్వం వరకు ప్రస్థానం..

■ బీజేవైఎం మండల అధ్యక్షుడి నుంచి జిల్లా ఉపాధ్యక్షుడి వరకు రాజకీయ ప్రస్థానం

■ మండల అధ్యక్షుడిగా మూడుసార్లు.. ఇప్పుడు జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు

■ పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: ఎర్రబెల్లి సంపత్ రావు



**(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీకి సంబంధించిన సంస్థాగత కార్యక్రమాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు ఎర్రబెల్లి సంపత్ రావు. జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన ఆయనకు కరీంనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా మూడోసారి అవకాశం లభించింది. పార్టీ నాయకత్వం తనపై మరోసారి విశ్వాసం ఉంచి జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడంతో సంపత్ రావు మూడోసారి జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామస్థాయి నుంచి మండల, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పార్టీ కార్యకలాపాల్లో భాగస్వామిగా కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**బీజేవైఎంతో ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం**
ఎర్రబెల్లి సంపత్ రావు తన రాజకీయ ప్రస్థానాన్ని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జమ్మికుంట మండల అధ్యక్షుడిగా ప్రారంభించారు. యువతను పార్టీ వైపు ఆకర్షించడం, పార్టీ కార్యక్రమాల్లో యువకుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి సంస్థాగత బాధ్యతల్లో పనిచేశారు. అనంతరం బీజేపీ జమ్మికుంట మండల అధ్యక్షుడిగా మూడుసార్లు బాధ్యతలు నిర్వహించారు. మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో కొనసాగుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే దిశగా పనిచేశారు.

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్థాయిలోనూ బాధ్యతలు**
మండల స్థాయిలో తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన సంపత్ రావుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేసే అవకాశం లభించింది. రాష్ట్ర స్థాయి బాధ్యతల అనంతరం కరీంనగర్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా పనిచేశారు. ఈ క్రమంలో పార్టీకి సంబంధించిన వివిధ సంస్థాగత కార్యక్రమాల్లో భాగస్వామిగా కొనసాగారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, తాజాగా అదే పదవికి మూడోసారి అవకాశం దక్కించుకున్నారు.

**నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా**
జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడోసారి అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి ఎర్రబెల్లి సంపత్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.
తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సంపత్ రావు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**కార్యకర్త స్థాయి నుంచి జిల్లా స్థాయి బాధ్యతల వరకు..**
బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మొదలైన ప్రస్థానం, బీజేపీ మండల అధ్యక్షుడిగా మూడుసార్లు నిర్వహించిన బాధ్యతలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలు, జిల్లా కార్యదర్శి పదవి.. ఇలా వివిధ స్థాయిల్లో పనిచేసిన సంపత్ రావు ఇప్పుడు జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు చేపట్టడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో ముందడుగుగా నిలిచింది. గండ్రపల్లి గ్రామానికి చెందిన నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం జిల్లా స్థాయి పార్టీ బాధ్యతల వరకు చేరడం విశేషంగా నిలుస్తోంది. 3 వ సారి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామ్మకమైన సంపత్ రావు ను జమ్మికుంట బిజెపి శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో బిజెపి జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు జీడీ మల్లేష్, ఇల్లంతకుంట మండలం మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, కోరె రవిందర్,కొమ్ము అశోక్ మేక సుధాకర్ రెడ్డి పల్లపు రవి,
గుర్రం పరుశురాం, గట్టు సాయిరాం, మోత స్వామి ఇటుకాల స్వరూప, ఎదలా పురం అశోక్, మోడెం రాజు, లోకిని రాజేష్, తూర్పాటి శంకర్, కడెం సతీష్, ఉడుగుల మహేందర్, పోడేటి అనిల్,ఏగ్గటి హరీష్, చెంద్రమౌళి, బొజ్జ శరత్, కనుమల్ల లక్ష్మి, లల్లు, పసునూటి శివ, లకిడే రాజు, గడ్డం శ్రీ వర్మ కొడశీ శ్రావణ్, పల్లబోయిన పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి మున్సిపల్ టిపిఓ సునీల్‌ను

## వెంటనే సస్పెండ్ చేయాలి




■ బి ఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ ల నిరసన.

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**బెల్లంపల్లి పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తాండ్ర రామకృష్ణ పై, దురుసుగా ప్రవర్తించి, చేయి చేసుకున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, బిఆర్ఎస్ పార్టీ ప్రస్తుత కౌన్సిలర్లు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులపై 20వ వార్డు మాజీ కౌన్సిలర్ తాండ్ర రామకృష్ణ, వివరాలు కావాలని అడిగినందుకు, దురుసుగా ప్రవర్తించిన సునీల్, కుర్చీ లాగి దాడి చేశాడని ఆరోపించారు. మాజీ ప్రజా ప్రతినిధి అయిన తాండ్ర రామకృష్ణ పై దాడికి పాల్పడిన సునీల్ పై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అనుమతులు లేకుండా

## ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** అనుమతులు, అవసరమైన అర్హతలు లేకుండా ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభుదాస్ హెచ్చరించారు.
శుక్రవారం హుజురాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రోడ్డులో ఉన్న ప్రియాంక క్లినిక్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హతలు, అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి, దానిని కొనసాగించరాదని డాక్టర్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.



ప్రతి ప్రైవేట్ క్లినిక్ నిర్వాహకుడు సంబంధిత చట్ట నిబంధనల ప్రకా రం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, గడువు ముగిసిన వారు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.
నిబంధనలు పాటించకపోతే జరిమానాలతో పాటు క్లినిక్‌లను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. వైద్యుల అర్హత పత్రాలు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, పారామెడికల్ సిబ్బంది సంబంధిత బోర్డు రిజిస్ట్రేషన్‌తో పాటు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అనుమతులు, అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య బోధకులు పంజాల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల

## పనితీరు మెరుగుపరచాలి




■ ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

■ కలెక్టర్ సత్య శారద

**వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)**జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పనితీరును మెరుగుపరచాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, మహిళలు, శిశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాబోయే రెండు నెలల్లో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి లోపాలను సరిచేయాలని,
చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందేలా చూడాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు,
పోషకాహార సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
కిశోర బాలికలకు బాల్య వివాహాలు, బాలల రక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.
ఈ సమావేశంలో అదనపు కలె క్టర్ వై.వి. గణేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# బోర్నపల్లిలో నవంబర్ 18 నుంచి

## లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో నవంబర్ 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించ నున్నట్లు ఆలయ ప్రధాన పూజారి పందిళ్ల భాస్కర్ శర్మ తెలిపారు. నవంబర్ 18న గణపతి హోమం, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 19న వివిధ అభిషేకాలు, అధివాస పూజలు, హవన కార్యక్రమాలు జరగనున్నాయి. నవంబర్ 20న శుక్రవారం ఉదయం 9.48 గంటలకు యంత్రస్థాపనతో పాటు శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు, మహా ప్రసాద నివేదన, పూర్ణాహుతి, హారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శనం, తీర్థప్రసాదం, అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.
ఈ వేడుకల నిర్వహణపై ఆలయ ప్రాంగణంలో అధ్యక్షుడు దొంత రమేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి తాత్కాలిక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# కేయూ హాస్టల్ ఖజానాకు గండి?

- ఆగస్టు 21న ఉత్తర్వులు.. ఫిబ్రవరి నుంచే భత్యాల చెల్లింపులా?
- రూ.80 వేలకు పైగా నిధులు డ్రా చేశారంటూ ఆరోపణలు.. విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్



OFFICE OF THE REGISTRAR
KAKATIYA UNIVERSITY
Vidyaranyapuri, WARANGAL – 506 009
Telangana, INDIA

No.818/A2/KU/2026/AO-110 Date: 21-08-2026

ORDERS

Sub:- Establishment – Administrative Officers – Dr. K. Sumalatha, Director, University Women's Hostels, Kakatiya University, Warangal – Sanction of Conveyance allowance @ Rs.6,000/- per month – Orders – Issued.

Ref:- 1) KU Orders No. 197/A2/KU/2024/AO-110, dated 16/02/2026.
2) Lr. No. 66/UHO/KU/2026, dated 21/07/2026 from Director, University Women's Hostels.

-o0o-

The Director, University Women's Hostel, KU has requested to sanction of Vehicle allowance @ 6,000/- to meet the travel and conveyance expenses for official purpose.

After careful examination of her request, the Vice-Chancellor has accorded permission for sanction of Vehicle allowance @ Rs. 6,000/- per month to Dr. K. Sumalatha, Director, University Women's Hostels, Kakatiya University, to meet her travel & conveyance expenses for inspecting all the University Women's Hostels daily and for smooth functioning of University Women's Hostels, KU.

The payment shall be made to her from the available funds of the University Hostels.

REGISTRAR

To
Dr. K. Sumalatha
Director, University Women's Hostels, KU.

Copy to:
1) The I/c Finance Officer, KU.
2) The Deputy/Asst. Registrar (Accounts/Audit), KU.
3) The Vice-Chancellor/Registrar's Peshi, KU.
4) The Person/Personal files concerned.
5) The Stack File.

**హనుమకొండ,జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి:**కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) హాస్టళ్ల ఆర్థిక వ్యవహారాలు వివాదాస్పదంగా మారాయి. హాస్టల్ డైరెక్టర్లకు ప్రయాణ, రవాణా భత్యాల చెల్లింపులపై విద్యార్థి సంఘాలు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మహిళా హాస్టళ్ల డైరెక్టర్‌కు నెలకు రూ.6,000 చొప్పున భత్యం మంజూరు చేస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం 2026 ఆగస్టు 21న ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. అయితే, ఫిబ్రవరి నుంచే ఈ భత్యాలు చెల్లించినట్లు ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

**ఉత్తర్వులు ఆగస్టులో.. చెల్లింపులు ఫిబ్రవరి నుంచేనా?**
కేయూ మహిళా హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ కె. సుమలతకు హాస్టళ్ల తనిఖీలు, అధికారిక విధుల నిమిత్తం ప్రయాణాలు, రవాణా ఖర్చుల కోసం నెలకు రూ.6,000 భత్యం మంజూరు చేసినట్లు ఆగస్టు 21న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని విశ్వవిద్యాలయ హాస్టళ్ల నిధుల నుంచి చెల్లించాలని సూచించినట్లు సమాచారం.
అయితే, ఫిబ్రవరి 2026 నుంచే డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుమలతలకు ఈ తరహా భత్యాలు చెల్లించినట్లు, మొత్తంగా రూ.80 వేలకు పైగా నిధులు డ్రా చేసినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆగస్టు 21న ఉత్తర్వులు జారీ అయితే, అంతకుముందు నెలలకు చెల్లింపులు ఎలా జరిగాయని ప్రశ్నిస్తున్నాయి. గత తేదీల నుంచి భత్యం వర్తింపజేసేందుకు ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? ఉంటే వాటికి సంబంధించిన ఉత్తర్వులు ఎక్కడున్నాయని నిలదీస్తున్నాయి.

**ఆడిట్ అధికారుల పరిశీలన ఏమైంది?**
విశ్వవిద్యాలయంలో నిధుల చెల్లింపులకు సంబంధించిన బిల్లులను సంబంధిత విభాగాలు నిబంధనల ప్రకారం పరిశీలించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఉత్తర్వులకు ముందున్న నెలలకు సంబంధించిన బిల్లులను ఎవరు ఆమోదించారు? ఏ నిబంధనల ప్రకారం చెల్లింపులు చేపట్టారు? ఆడిట్, అకౌంట్స్ విభాగాలు ఈ అంశాలను పరిశీలించాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చెల్లింపులకు సంబంధించిన బిల్లులు, అనుమతి పత్రాలు, ఆమోద ఉత్తర్వులు, నిధుల బదిలీ వివరాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**హాస్టళ్లలో సమస్యలు ఎన్నో.. భత్యాలపై వివాదాలెన్నో!**
కేయూ హాస్టళ్లలో తాగునీరు, పారిశుధ్యం, భోజన నాణ్యత, మరమ్మతులు, విద్యార్థుల భద్రత వంటి సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో హాస్టళ్ల తనిఖీల పేరుతో భత్యాలు చెల్లించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.
డైరెక్టర్లు ఎన్ని హాస్టళ్లను సందర్శించారు? ఏ తేదీల్లో తనిఖీలు నిర్వహించారు? పర్యటనలకు సంబంధించిన రికార్డులు, తనిఖీ నివేదికలు ఉన్నాయా? ప్రయాణ ఖర్చులకు ఆధారాలు సమర్పించారా? అనే వివరాలను వెల్లడించాలని కోరుతున్నాయి.

**సమగ్ర విచారణకు డిమాండ్**
ఈ వ్యవహారంపై కేయూ వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్, ఫైనాన్స్ అధికారి, ఆడిట్ విభాగం స్పందించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఫిబ్రవరి నుంచి జరిగిన చెల్లింపుల వివరాలను వెల్లడించడంతో పాటు, అవసరమైతే ప్రత్యేక ఆర్థిక ఆడిట్ నిర్వహించాలని కోరుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగాయని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అనర్హంగా చెల్లించిన మొత్తాలను తిరిగి వసూలు చేయాలని పేర్కొంటున్నాయి. అయితే, చెల్లింపులకు సంబంధించిన అసలు రికార్డులు, అధికారిక వివరణ అందుబాటులోకి వస్తేనే ఆరోపణల్లోని వాస్తవాలు స్పష్టమవుతాయి.

విద్యార్థుల సంక్షేమం కోసం వినియోగించాల్సిన హాస్టల్ నిధుల ఖర్చుపై పారదర్శకత ఉండాలని, భత్యాల చెల్లింపులపై అధికారులు సమాధానం చెప్పాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# నాగంపేట శివారులో రోడ్డు ప్రమాదం

- వెనుక నుంచి బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**(జమ్మికుంట,జోర్దార్ ప్రతినిధి)**కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నాగంపేట గ్రామ శివారులోని రైస్‌మిల్లుల సమీపంలో కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.
వివరాల్లోకి వెళితే.. జమ్మికుంట గ్రామానికి చెందిన ఎలుకపెల్లి దేవేందర్ (35), తన తల్లి కళావతి, బావమరిది పురుషోత్తం స్టాలిన్‌తో కలిసి పండుగ సందర్భంగా ఈ నెల 20వ తేదీన సాయంత్రం సుమారు 6.30 గంటలకు కుందనపల్లి గ్రామానికి బయలుదేరారు. నాగంపేట గ్రామ శివారులోని రైస్‌మిల్లుల సమీపానికి చేరుకోగానే, వెనుక నుంచి వచ్చిన కారు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.
కారు నడుపుతున్న మంచాల కమాన్ అజాగ్రత్తగా, అతివేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.
ప్రమాదానికి సంబంధించి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నిజాలు రాస్తే జైలుకేనా?

## ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులపై కేసులు, వేధింపులు మారవా?

- మెడికవర్ ఆసుపత్రి వ్యవహారంపై కథనాలు రాసిన శంకర్ అరెస్టుతో మరోసారి చర్చ
- ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ!




**(హైదరాబాద్,జోర్దార్ ప్రతినిధి)**ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, తప్పులను ప్రశ్నిస్తూ, బాధితుల పక్షాన నిలబడాల్సిన జర్నలిస్టులకు రక్షణ కరువవుతోందా? ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టులపై కేసులు, వేధింపులు మాత్రం కొనసాగుతున్నాయా? అధికారంలో ఎవరున్నా పాలకుల వైఫల్యాలను ఎత్తిచూపితే అరెస్టులే సమాధానమవుతున్నాయా? ప్రస్తుతం తెలంగాణలో జర్నలిస్టు శంకర్ అరెస్టు నేపథ్యంలో ఈ ప్రశ్నలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.
ఇటీవల హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో ఓ మహిళ మృతి చెందిన వ్యవహారంపై ఆసుపత్రి యాజమాన్యం తీరును ప్రశ్నిస్తూ కథనాలు ప్రసారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబ్ జర్నలిస్టు శంకర్ అరెస్టు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆసుపత్రి వ్యవహారంలో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే జర్నలిస్టు చేసిన పని అయితే, ఆయనపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ కేసులోని ఆరోపణలు, పోలీసుల వాదనలు, న్యాయస్థానంలో తేలాల్సిన అంశాలను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల కష్టాలు తీరవా?**
తెలంగాణలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనూ జర్నలిస్టులపై కేసులు, వేధింపులు చోటుచేసుకున్నాయనే విమర్శలు వచ్చాయి. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు జర్నలిస్టులపై కేసులను తీవ్రంగా వ్యతిరేకించిన సందర్భాలున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రభుత్వ విధానాలను, అధికారుల పనితీరును, ఆసుపత్రులు సహా వివిధ సంస్థల వ్యవహారాలను ప్రశ్నించే జర్నలిస్టులపై చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం రాజకీయ పార్టీలకు తగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఎవరున్నా విమర్శలను స్వీకరించే సహనం ఉండాలని, తప్పులను ఎత్తిచూపే గొంతులను అణచివేసే ప్రయత్నాలు చేయకూడదని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రశ్నిస్తే కేసులా.. ఆధారాలుంటేనే చర్యలా?**
ప్రజలకు సంబంధించిన అంశాలపై వార్తలు రాసే జర్నలిస్టులపై ఫిర్యాదులు వచ్చినప్పుడు, వాటిని చట్టప్రకారం విచారించాల్సిందే. అయితే, వార్తా కథనాలపై అభ్యంతరాలున్నాయనే కారణంతోనే జర్నలిస్టులను వేధించడం లేదా వారి వృత్తి స్వేచ్ఛను దెబ్బతీయడం సమంజసం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.
ఒకవైపు ప్రజల ప్రాణాలకు సంబంధించిన వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణలు వస్తే, వాటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంటుంది. మరోవైపు వార్తల పేరుతో నిరాధార ఆరోపణలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే వాటినీ చట్టబద్ధంగానే పరిశీలించాలి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలే తప్ప, ఎవరి ఒత్తిడికో తలొగ్గి చర్యలు తీసుకుంటున్నారనే అనుమానాలకు తావివ్వకూడదు.

**జర్నలిస్టులపై వేధింపులకు అడ్డుకట్ట పడేదెప్పుడు?**
శంకర్ ఒక్కరే కాదు.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులు సైతం ఒత్తిళ్లు, బెదిరింపులు, కేసుల భయంతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు ఉన్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి, అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యం, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై వార్తలు రాసే వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
అదే సమయంలో జర్నలిస్టులు కూడా వాస్తవాలను నిర్ధారించుకుని, ఆధారాలతో వార్తలు ప్రచురించాల్సిన బాధ్యతను విస్మరించకూడదు. వార్తలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలి.
జర్నలిస్టులపై నమోదయ్యే కేసుల్లోనూ పారదర్శకమైన విచారణ జరగాలి. తప్పు చేసినవారు ఎవరైనా చట్టప్రకారం చర్యలు ఎదుర్కోవాలి. నిర్దోషులకు అన్యాయం జరగకుండా చూడాలి.

**నాలుగో స్తంభాన్ని కాపాడుకోవాలి**
ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా గుర్తింపు పొందింది. ప్రజల గొంతుకగా నిలుస్తూ, పాలకులను ప్రశ్నిస్తూ, సమాజంలోని లోపాలను ఎత్తిచూపే స్వేచ్ఛ జర్నలిస్టులకు అత్యంత కీలకం.
ఆ స్వేచ్ఛకు భంగం కలిగితే ప్రజలకు వాస్తవాలు తెలుసుకునే అవకాశం తగ్గిపోతుంది.
రాజకీయాలకు అతీతంగా జర్నలిస్టుల వృత్తి స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరం ఉంది. జర్నలిస్టు శంకర్ అరెస్టు వ్యవహారంలోనూ వాస్తవాలు పారదర్శకంగా వెలుగులోకి రావాలని,
చట్టప్ర కారం నిష్పక్షపాత విచారణ జరగాలని, తప్పు చేసి నవారిపై తగిన చర్యలు తీసుకుంటూనే నిరాధార ఆరోపణలకు గురయ్యే వారికి న్యాయం జరగాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

# కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా

## అని ప్రజలు ఎదురు చూస్తున్నారు



- కేటీఆర్

**హైదరాబాద్ :** గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. అడ్డమైన మాటలు, అడ్డమైన ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన అంబర్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా..
కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.
అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందని మండిపడ్డారు. పరిపాలన చేతకాక ప్రజలకు ఏమీ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావంపై 10 నెలల ముందే ప్రభుత్వాన్ని అలర్ట్ చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.పక్క రాష్ట్రాలు, దిగువ రాష్ట్రాలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రాజెక్టులను నింపుకున్నాయి.

**తెలివిలేని రేవంత్ రెడ్డి..**
తెలివిలేని రేవంత్ రెడ్డి మాత్రం ప్రాజెక్టులను నింపలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం పంపులు ప్రారంభిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తాను చేసిన అబద్ధాలు ప్రజల ముందు తేలిపోతాయని రేవంత్ రెడ్డి కుట్ర చేశారు.
మేడిగడ్డ కూలిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వాళ్లే మేడిగడ్డను కూల్చారన్నారు. రాహుల్ గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డ కూలిపోయిందంటూ అబద్ధాలు చెప్పించారన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని కేటీఆర్ తెలిపారు.

రేవంత్ రెడ్డి దున్నపోతు ఇనిందంటే.. కిషన్ రెడ్డి దూడను కట్టేయమంటారు. కేసీఆర్‌పై విమర్శలు చేసే విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటవుతాయి. పిచ్చోడి చేతిలో రాయిలా పాలన సాగుతోంది. మరో ఏడాది రేవంత్ రెడ్డి హడావుడి ఉంటుందని, ఆ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. తెలంగాణలో లూటీ పాలన నడుస్తోంది.
తెలంగాణలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. కాంగ్రెస్ చేతుల్లో మోసపోయిన అన్ని వర్గాలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయని చెప్పారు.

**మోదీ ఏం చేస్తున్నాడో చూస్తానే ఉన్నాం..**
తెలంగాణలోనే కాదు మళ్లీ దేశంలో కేసీఆర్ కీలకం కాబోయే రోజులు దగ్గరలో ఉన్నాయని స్పష్టం చేశారు.
కాంగ్రెస్, బీజేపీ యేతర పార్టీలు దేశంలో కీలకం కాబోతున్నాయి. నాలుగు సంవత్సరాల కింద కేసీఆర్ కాంగ్రెస్, బిజెపియేతర కూటమి అంటే చాలామందికి అర్థం కాలేదు.
మోదీ ఏం చేస్తున్నాడో చూస్తానే ఉన్నాం. ఈరోజు ఒకవైపు దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బిజెపికి ప్రత్యామ్నాయ ఎజెండా లేని కాంగ్రెస్ చూసిన తర్వాత కెసిఆర్ చెప్పింది వాస్తవం అని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఎంత చేసిన లాభం లేదు. రాహుల్ గాంధీకి ఎన్ని జాకీలు పెట్టిన లేస్తలేదు.

దేశంలో కాంగ్రెస్ విఫలమైంది కాబట్టే బిజెపి పార్టీపై సీజేపీ పేరుతో యువతీ యువకులు పోరాటం చేస్తు న్నారని గుర్తు చేశారు. రాజకీయ నాయకులను బిజెపి బెదిరించగలుగుతుంది కానీ యువతరాన్ని కాదు అని అర్థమైంది. బిజెపి గత పది సంవత్సరాలు ఎప్పుడు లేనంత బలహీనంగా తయారయిందన్నారు.
కాంగ్రెస్, బిజెపి ఎంపీలు తెలంగాణలో కలిసిపోయి పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేయకుండా కేవలం.. కేసీఆర్, కేటీఆర్ ని తిట్టడమే పనిగా పెట్టుకు న్నారు.

**కాంగ్రెస్‌కు వారు బుద్ధి చెప్పడం ఖాయం..**
రాష్ట్రంలో ఎంపీటీసీ జడ్పిటిసి కార్పొరేషన్ ఎన్నికలు పెట్టే ధైర్యం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్‌కు లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017లో సెంచరీ కొట్టిన తీరుగా బీఆర్ఎస్ కార్పొరేషన్లను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి మొదలుకొని ఎన్నికల దాకా కలిసి పనిచేయాలి. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ధన బలాన్ని మాత్రమే నమ్ము కున్నది. విద్యార్థులను నిరుద్యోగులను యువతి యువకులను యూత్ డిక్లరేషన్ పేరుతో దారుణంగా మోసం చేసింది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వారు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు

# సనత్‌నగర్ ఐటీఐ భూమి ఏమైంది?

- రెండెకరాల ప్రభుత్వ స్థలంపై ఆరోపణలు.. విచారణ నివేదికలు ఎందుకు బయటపెట్టడం లేదు?
- ఐదేళ్లుగా అక్రమాలు జరిగాయంటూ సామాజికవేత్త రమ్యకృష్ణ ఆరోపణ
- వారం రోజుల్లో చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌లో ఆందోళనకు సిద్ధమని హెచ్చరిక

**హైదరాబాద్,జోర్దార్ ప్రత్యేక ప్రతినిధి**
రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) స్థలానికి సంబంధించిన వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందన్న ఆరోపణలు, గతంలో జరిగిన విచారణలు, వాటి నివేదికల బహిర్గతంపై ప్రశ్నలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రభుత్వ స్థలానికి సంబంధించిన ఈ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సామాజికవేత్త రమ్యకృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు.

**రెండెకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు పరం అయిందా?**
సనత్‌నగర్‌లో ఆల్విన్ కార్మికుల పిల్లలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఐటీఐని అక్కడి నుంచి మల్లేపల్లికి తరలించాల్సిన అవసరం ఏమొచ్చిందని రమ్యకృష్ణ ప్రశ్నించారు. ఐటీఐని తరలించడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వానికి చెందిన విలువైన రెండెకరాల స్థలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి




వెళ్లిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**రెండు విచారణ నివేదికలు ఏమయ్యాయి?**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై రెండు విచారణలు జరిగినట్లు పేర్కొంటున్న రమ్యకృష్ణ.. వాటికి సంబంధించిన నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుడు (ఆర్డీడీ) నిర్వహించిన విచారణలో వెల్లడైన అంశాలేమిటి? పెద్దపల్లికి ఉన్నతాధికారులు ఎన్నిసార్లు వెళ్లి విచారణ చేపట్టారు? ఆ విచారణల్లో ఏం తేలింది? నివేదికలను బయటపెట్టకుండా అడ్డుకుంటున్నదెవరు? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.

**బాధ్యులపై చర్యలు ఎప్పుడు?**
ప్రభుత్వ భూమి వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని రమ్యకృష్ణ ప్రశ్నించారు. బాధ్యులుగా తేలిన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం జరిగితే దానికి బాధ్యులైన వారి నుంచి నష్టాన్ని రాబట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), విజిలెన్స్ విభాగాల దర్యాప్తు ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, విచారణల పేరుతో కాలయాపన చేయకుండావాస్తవాలను ప్రజల ముందుంచాలని పేర్కొన్నారు.

**వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలి**
సనత్‌నగర్ ఐటీఐ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమాలకు బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవాలని రమ్యకృష్ణ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి పంపిన లేఖలో వారం రోజుల్లోగా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. లేని పక్షంలో హైదరాబాద్‌లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఐటీఐ తరలింపు వెనుక కారణాలు, గత విచారణల్లో వెల్లడైన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

# సూరారం పీఎస్ పరిధిలో

## నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి మృతి



నీళ్ల బకెట్‌లో పడి ఏడాదిన్నర వయస్సు గల చిన్నారి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన సురారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాండు బస్తీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీహార్ రాష్ట్రానికి చెందిన పప్పూ రవిదాస్(45) కూలీ పనులు చేసుకుంటూ ప్రస్తుతం పాండు బస్తీలో నివాసం ఉంటున్నాడు. ఇతనితో పాటు ఇతని కుమార్తె రాణీ దేవి కుమార్తె ఏడాదిన్నర వయసున్న దివాంశి కుమారి కూడా ఇక్కడే నివసిస్తోంది.
చిన్నారి తల్లి బీహార్‌లో ఉంటుండగా పప్పూ రవి దాస్ కుమార్తె చాందిని కుమారి చిన్నారిని ఇంటి వద్ద చూసుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చిన్నారి నీళ్ల బకెట్‌లో పడి చనిపోయింది.
పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు

# డరీ లైన్‌లో పాక్ ఫీల్డర్లను తలపించిన సాంట్నర్-ఫిలిప్స్.



భారత్-న్యూజిలాండ్ తొలి టీ20లో ఆసక్తికరమైన ఫీల్డింగ్ ఘటన చోటుచేసుకుంది. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్, స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ ంచేసిన ఫీల్డింగ్ తప్పిదం అందరి దృష్టిని ఆకర్షించింది. భారత్ ఛేజింగ్ ప్రారంభ దశలో ఈ ఘటన జరిగింది. లాకీ ఫెర్గూసన్ వేసిన బంతిని భారత ఓపెనర్ సంజూ శాంసన్ ) కవర్స్ వైపు ఆడే ప్రయత్నం చేశాడు. అయితే బంతి బ్యాట్ కింది భాగానికి తగిలి బౌండరీ వైపు నెమ్మదిగా వెళ్లింది. బంతిని గమనించిన సాంట్నర్, ఫిలిప్స్ వేగంగా అక్కడికి చేరుకున్నారు. బౌండరీకి చేరువలో ఇద్దరూ దాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే బంతిని నియంత్రించే క్రమంలో వారి ప్రయత్నం బెడిసికొట్టింది. ఇద్దరి ఫీల్డింగ్ ప్రయత్నం కారణంగా బంతి చివరకు బౌండరీ రోప్‌ను దాటింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో క్రికెట్ అభిమానులు స్పందిస్తున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌లో పాకిస్థాన్ ఫీల్డింగ్ తప్పిదాలతో పోలుస్తూ కొందరు అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఇలాంటి పొరపాట్లు క్రికెట్‌లో ఏ జట్టుకైనా జరగొచ్చు. ఇదే మ్యాచ్‌లో భారత్ కూడా కొన్ని ఫీల్డింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోం ంది. డారిల్ మిచెల్ ఇచ్చిన క్యాచ్‌ను అభిషేక్ శర్మఅందుకోలేకపోయాడు. ఆ సమయంలో మిచెల్ 16 పరుగుల వద్ద ఉన్నాడు. లభించిన అవకాశాన్ని ఉపయోగించుకున్న అతడు 19 బంతుల్లో 28 పరుగులు చేశాడు. ఫీల్డింగ్‌తో పాటు భారత జట్టుకు ఓవర్‌రేట్ సమస్య కూడా ఎదురైంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ () నేతృత్వంలోని భారత్ నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయలేకపోవడంతో చివరి ఓవర్‌లో అదనపు ఫీల్డర్‌ను 30-యార్డ్

# 23 బంతుల్లోనే ఫిఫ్టీ.. న్యూజిలాండ్‌పై శాంసన్ సూపర్ ఇన్నింగ్స్..



న్యూజిలాండ్‌తో తొలి టీ20లో భారత ఓపెనర్ సంజూ శాంసన్ (ఘుఅయబ ఘుఎంశీఅ) మరోసారి తన బ్యాటింగ్ సత్తా చూపించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో 226 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శాంసన్ అద్భుతమైన ఆరంభం అందించాడు. కేవలం 33 బంతుల్లో 67 పరుగులు చేసి భారత విజయానికి బలమైన పునాది వేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. శాంసన్ తన దూకుడును తొలి ఓవర్ నుంచే చూపించాడు. న్యూజిలాండ్ బౌలర్లపై ఎలాంటి ఒత్తిడి లేకుండా షాట్లు ఆడిన అతడు కేవలం 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. క్రైస్ట్‌చర్చ్‌లో టీ20ల్లో భారత బ్యాటర్ చేసిన అత్యంత వేగవంతమైన అర్ధశతకాల జాబితాలో శాంసన్ ఈ ప్రదర్శనతో ప్రత్యేక స్థానం సంపాదించాడు. 2026లో భారత్ తరఫున 50ం స్కోర్లు 2026లో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో శాంసన్‌కు ఇది ఎనిమిదో 50ం స్కోరు. ఈ జాబితాలో సూర్యకుమార్ యాదవ్ 2022లో 11 సార్లు 50ం స్కోర్లు సాధించి అగ్రస్థానంలో ఉన్నాడు. 2022లో విరాట్ కోహ్లీ 9 సార్లు నమోదు చేశాడు. 2026లో అభిషేక్ శర్మ 9 సార్లు, ఇషాన్ కిషన్ 8 సార్లు, శాంసన్ 8 సార్లు ఈ ఘనత సాధించారు. ఓపెనర్‌గా మరో మైలురాయిటీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున ఓపెనర్‌గా అత్యధిక 50ం స్కోర్లు చేసిన ఆటగాళ్ల జాబితాలోనూ శాంసన్ తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు. రోహిత్ శర్మ 32 అర్ధశతకాలు లేదా అంతకంటే ఎక్కువ స్కోర్లతో అగ్రస్థానంలో ఉండగా, కేఎల్ రాహుల్ 21, అభిషేక్ శర్మ 17తో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. శాంసన్ ఖాతాలో ఇప్పుడు 12 50ం స్కోర్లు ఉన్నాయి.

# ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్.. కట్‌చేస్తే.. ఆ తర్వాత ఊహించని షాక్.. ఏకంగా 2 మ్యాచ్‌ల నిషేధం

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు సీనియర్ పేసర్ మేగన్ షుట్ (తెలిపింది. ఈ సస్పెన్షన్ కారణంగా 33 ఏళ్ల షుట్ రెండు కీలక మ్యాచ్‌లకు దూరం కానుంది. గురువారం



న్యూజిలాండ్‌తో నార్త్ సిడ్నీ ఓవల్‌లో జరిగే మూడో టీ20 మ్యాచ్‌లో ఆమె ఆడలేరు. ఆస్ట్రేలియా ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉంది. అంతేకాదు, మహిళల బిగ్ బాష్ లీగ్ (ఔదీదీూ)లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరఫున కూడా షుట్ తొలి మ్యాచ్‌కు అందుబాటులో ఉండదు. అక్టోబర్ 31న మెల్‌బోర్న్ స్టార్స్‌తో జరిగే సీజన్ ఓపెనర్‌ను ఆమె మిస్ కానుంది. ఈ రెండు మ్యాచ్‌ల నిషేధం అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్‌కు వర్తిస్తుందని క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొంది. ఈ నిర్ణయాన్ని షుట్ అంగీకరించింది. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంలో విఫలమైనందుకు ఆమె క్షమాపణలు తెలిపింది. ఆటగాళ్లకు స్పోర్ట్స్ సైన్స్ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ మార్గదర్శకాలపై క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తున్నారని, వాటిని పాటించడం తన బాధ్యత అని ఆమె పేర్కొంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో షుట్ అద్భుత ప్రదర్శన చేసింది. మూడు మ్యాచ్‌ల్లో 10 వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును సొంతం చేసుకుంది. అలాంటి ఫామ్‌లో ఉన్న సమయంలో వచ్చిన ఈ రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ ఆమెకు కీలక దశలో ఎదురైన అనూహ్య విరామంగా మారింది.

క్రికెట్ ఆస్ట్రేలియా కూడా షుట్‌కు అవసరమైన మద్దతు కొనసాగిస్తామని తెలిపింది. అదే సమయంలో దేశానికి ప్రాతినిధ్యం వహించే ప్రతి ఆటగాడు వైద్య మార్గదర్శకాలు,

# ఐటీ షేర్లలో భారీ ర్యాలీ.. టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు ఎందుకు పెరిగాయి?




భారత స్టాక్ మార్కెట్‌లో ఐటీ కంపెనీల షేర్లు మరోసారి జోరందుకున్నాయి. టెక్ మహీంద్రా, విప్రో, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ుజూ) షేర్లు ట్రేడింగ్‌లో గణనీయంగా పెరిగాయి. మెరుగైన త్రైమాసిక ఫలితాలు, రాబోయే నెలల్లో పెద్ద డీల్స్ ఖరారయ్యే అవకాశాలు, అంతర్జాతీయ మార్కెట్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సంబంధిత షేర్లలో చోటుచేసుకున్న ఒడిదుడుకులు ఈ ర్యాలీకి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఐటీ షేర్లలో ఎత పెరుగుదల నమోదైంది?అక్టోబర్ 16 ఉదయం ట్రేడింగ్ సమయంలో ఐటీ రంగానికి చెందిన ప్రధాన షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. టెక్ మహీంద్రా: సుమారు 7.11% పెరుగుదల ఉండగా, విప్రో దాదాపు 4% పెరుగుదల ఉంది. అలాగే ఇన్ఫోసిస్ సుమారు 3.71% పెరుగుదల, టీసీఎస్: దాదాపు 3.19% పెరుగుదల, అలాగే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఉదయం ట్రేడింగ్‌లో సుమారు 2.8% లాభంతో ఉంది. టెక్ మహీంద్రా ఫలితాలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహం:టెక్ మహీంద్రా రెండో త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించడంతో ఆ కంపెనీ షేర్లపై కొనుగోళ్ల ఆసక్తి పెరిగింది. మెరుగైన ఆదాయం, బలమైన డీల్స్ కంపెనీ పనితీరుపై పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయి. నివేదికల ప్రకారం.. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 32.74% పెరిగింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 16న షేరు ధర 8%కు పైగా పెరిగినట్లు నివేదించారు. విప్రో ఆదాయం అంచనాలను మించిందివిప్రో షేర్లు కూడా లాభాల్లో ట్రేడయ్యాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ ఆదాయం విశ్లేషకుల అంచనాలను అధిగమించింది. భవిష్యత్తులో ఆలస్యమైన కొన్ని పెద్ద డీల్స్ ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయన్న యాజమాన్య వ్యాఖ్యలు కూడా షేర్లకు మద్దతునిచ్చాయి. అయితే, విప్రో విషయంలో కొన్ని ఆందోళనలు ఇంకా ఉన్నాయి. కొత్త డీల్స్ బుకింగ్స్ తగ్గడం, సమీప కాలంలో ఆదాయ వృద్ధిపై పరిమిత అంచనాలు ఉండటం వంటి అంశాలు కంపెనీ భవిష్యత్తు పనితీరుపై ప్రభావం చూపవచ్చు. అందుకే షేరు ధర పెరిగిందని కంపెనీ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని భావించకూడదు. ప్రపంచ మార్కెట్లలో ూ× కంపెనీఅంచనాలను మించడంతో ఆ కంపెనీ షేర్లపై కొనుగోళ్ల ఆసక్తి పెరిగింది. ల విలువలు, భారీ పెట్టుబడులపై వచ్చే రాబడుల గురించి ఆందోళనలు పెరిగాయి. దీంతో అంతర్జాతీయ టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడిదారులు భారత ఐటీ కంపెనీల విలువలను, వాటి త్రైమాసిక ఫలితాలను మళ్లీ పరిశీలించడం ప్రారంభించారు. మంచి ఫలితాలు ప్రకటించిన భారతీయ ఐటీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు పెరగడానికి ఇది ఒక కారణమైంది.

# ఖాతాదారుడు, నామినీ ఇద్దరూ మరణిస్తే బ్యాంకులోని డబ్బు ఎవరికి దక్కుతుంది?



ఈ రోజుల్లో బ్యాంకు ఖాతా కేవలం డబ్బును దాచుకోవడానికి మాత్రమే ఉపయోగపడదు. దీనిని ప్రభుత్వ పథకాల చెల్లింపులు, జీతాలు, రుణ వాయిదాలు, ఆన్‌లైన్ లావాదేవీల కోసం కూడా ఉపయోగిస్తారు. బ్యాంకు ఖాతా తెరిచేటప్పుడు, మనం ఒక నామినీ పేరును ఇస్తాము. ఖాతాదారుడు మరణించిన సందర్భంలో ఖాతా నుండి డబ్బును ఉపసంహరించుకునే ప్రక్రియను సులభతరం చేయడమే నామినీని నియమించడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం.

నామినీ మరణించిన సందర్భంలో..

అయితే ఖాతాదారుడు, నామినీ ఇద్దరూ మరణిస్తే ఏమి జరుగుతుంది? అటువంటి పరిస్థితిలో బ్యాంకులోని డబ్బు దానంతట అదే ప్రభుత్వానికి చెందదు. చట్టబద్ధమైన వారసులు సరైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించి ఈ డబ్బును క్లెయిమ్ చేసుకోవచ్చు. వారసుడు ఎవరనేది, అతనికి ఎంత అధికారం ఉందనేది ఆయా చట్టాలు, వీలునామా, కుటుంబ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

బ్యాంకులో డబ్బు:బ్యాంకు నుండి డబ్బు పొందే ప్రక్రియను సులభతరం చేసే వ్యక్తిని నామినీ అంటారు. కానీ అతను నామినీ అయినంత మాత్రాన ఆ డబ్బుకు పూర్తి యజమాని అయిపోడు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) మార్గదర్శకాల ప్రకారం, ఒక బ్యాంకు నామినీకి డబ్బు చెల్లించినప్పుడు, చట్టబద్ధమైన వారసుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా ఆ మొత్తాన్ని స్వీకరిస్తున్నట్లు బ్యాంకు స్పష్టం చేయాలి. వారసత్వ హక్కులు:బ్యాంకు నుండి డబ్బును క్లెయిమ్ చేయడానికి ఏ పత్రాలు అవసరం? సాధారణంగా మరణించిన ఖాతాదారుని మరణ ధృవీకరణ పత్రం, క్లెయిమ్ చేసేవారి గుర్తింపు, చిరునామా రుజువు, బ్యాంకు క్లెయిమ్ ఫారం, చట్టబద్ధమైన వారసుని రుజువు అవసరం. అవసరాన్ని బట్టి, బ్యాంకు వారసత్వ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల గురించిన సమాచారం, మరణ ధృవీకరణ పత్రం లేదా నష్టపరిహార పత్రం అడగవచ్చు. అయితే, ఈ పత్రాలన్నీ ప్రతి సందర్భంలోనూ తప్పనిసరి కాదు. మరణ ధృవీకరణ పత్రంఖాతాలోని మొత్తం బ్యాంకు విధానాలు, వారసుల మధ్య వివాదాలు మరియు వీలునామాలను బట్టి అవసరమైన పత్రాలు మారవచ్చు. నామినేట్ చేయని ఖాతాల క్లెయిమ్‌ల విషయంలో వారసులను అనవసరంగా వేధించవద్దని, సరైన విధానం ప్రకారం చెల్లింపులు చేయాలని రిజర్వ్ బ్యాంక్, బ్యాంకులను ఆదేశించింది. అందువల్ల, ముందుగా సంబంధిత బ్యాంకు శాఖను సందర్శించి, అవసరమైన పత్రాల ఖచ్చితమైన జాబితాను పొందడం ఎల్లప్పుడూ మంచిది.

# హైస్పీడ్ ఫైబర్ ఇంటర్నెట్.. బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ ప్లాన్స్ ఇవే:




ప్రభుత్వ రంగానికి చెందిన ప్రముఖ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (దీూచీూ) తన భారత్ ఫైబర్ (ఖీుఎ) వినియోగదారుల కోసం ఒక అద్భుతమైన ఆఫర్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫిక్స్‌డ్ ఓటీటీ ప్యాకేజీలకు స్వస్తి పలుకుతూ యూజర్లు తమకు నచ్చిన రీతిలో డిజిటల్ వినోదాన్ని కస్టమైజ్ చేసుకునేలా దీూ ాఃు దీబఅశ్రీఎవతీ సౌకర్యాన్ని పరిచయం చేసింది. ఈ ప్లాన్ ద్వారా ఏకంగా 25 కంటే ఎక్కువ ఓటీటీ యాప్స్ ల నుంచి తమకు కావలసిన ప్లాట్ ఫారమ్ లను స్వయంగా ఎంచుకోవచ్చు. దీనికి తోడు భారీ డేటా, వేగవంతమైన ఇంటర్నెట్తో కూడిన భారత్ ఫైబర్ బ్రాడ్ బ్యాండ్ ప్లాన్లను బీఎస్ఎన్ఎల్ పరిచయం చేసింది. బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ ప్లాన్స్ ఇవే:

రూ.549తో ఏకంగా 4000+దీ హైస్పీడ్ డేటాతో అందిస్తోంది. 60వీఎజూం వరకు స్పీడ్ తో వస్తుంది. ఆ తర్వాత 4 వీఎజూం స్పీడ్ లభిస్తుంది. రూ.699 ప్యాక్‌తో 4000 జీబీతో 100 వీఎజూం వేగం గల డేటా లభిస్తుంది. ఆ తర్వాత 4 వీఎజూం వరకు స్పీడ్ వస్తుంది.

రూ.799 ప్యాక్‌తోనూ 4000 +దీతో 150 ఎంబీపీఎస్ స్పీడ్‌తో డేటా లభిస్తుంది. ఆ తర్వాత 10 వీఎజూం వరకు స్పీడ్‌తో ఇంటర్నెట్ వస్తుంది.

రూ.999 ప్యాక్‌తో 5000 +దీతో 200 వీఎజూం స్పీడ్‌తో హైస్పీడ్ డేటా వస్తుంది. ఆ తర్వాత 10 వీఎజూం వరకు స్పీడ్ లభిస్తుంది.

రూ.549 ప్లాన్ ఎవరికి ఉపయోగపడుతుంది?

తక్కువ ధరలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ కావాలనుకునేవారికి రూ.549 ప్లాన్ ఒక ఎంపికగా ఉంటుంది. ఈ ప్లాన్‌లో నెలకు 4,000 జీబీ వరకు హైస్పీడ్ డేటా, గరిష్ఠంగా 60 వీఎజూం వేగం లభిస్తాయని కథనం పేర్కొంది. ఇంట్లో సాధారణ ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ తరగతులు, వీడియో స్ట్రీమింగ్, సోషల్ మీడియా వంటి అవసరాలకు ఈ వేగం ఉపయోగపడవచ్చు. అయితే ఒకేసారి ఎక్కువ పరికరాల్లో భారీ నాణ్యతతో వీడియోలు చూడడం లేదా పెద్ద ఫైళ్లను డౌన్‌లోడ్ చేయడం వంటి అవసరాలుంటే అధిక వేగం గల ప్లాన్లను పరిశీలించవచ్చు.

25కి పైగా ఓటీటీ యాప్స్‌లో నచ్చినవి ఎంచుకోవచ్చు

ఈ ఆఫర్‌లో ప్రధాన ఆకర్షణ దీూ ాఃు దీబఅశ్రీఎవతీ సదుపాయం. దీని ద్వారా 25కి పైగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వినియోగదారులు తమకు కావాల్సిన సేవలను ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఈ జాబితాలో జియో హాట్‌స్టార్, సోనీ లివ్, జీ5, లయన్స్‌గేట్ ప్లే, హోయ్‌చోయ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అన్ని ఓటీటీ సేవలు ప్రతి ప్లాన్‌లోనూ ఉచితంగా లభిస్తాయని భావించకూడదు. ఏ ప్లాట్‌ఫామ్‌కు ఎంత చెల్లించాలి, ఏ ప్లాన్‌కు ఏ సబ్‌స్క్రిప్షన్ వర్తిస్తుంది, ఎన్ని ఓటీటీ ఎంచుకోవచ్చనే వివరాలను ముందుగా పరిశీలించడం మంచిది.

శనివారం,
అక్టోబర్ 24 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



## రెండు మూడు సినిమాలతో కనిపించకుండా మాయం అయ్యింది.



తెలుగు సినీ పరిశ్రమలో కొంతమంది నటీనటులు తమ అందం, అభినయంతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటారు. అయితే వరుసగా సినిమాలు చేసినప్పటికీ, కొంతకాలం తర్వాత వెండితెరకు దూరమవుతుంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు సలోని. ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులను తన అందంతో, నటనతో ఆకట్టుకున్న ఈ భామ.. ముఖ్యంగా సునీల్ హీరోగా నటించిన మర్యాద రామన్న సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అప్పట్లో ఆమెను చూసిన ప్రేక్షకులు ఇప్పుడు ఆమె ఎలా ఉందో తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సునీల్.. ఆ తర్వాత హీరోగా మారి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆయన హీరోగా నటించిన అందాల రాముడు మంచి గుర్తింపు తెచ్చిపెట్టగా, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన మర్యాద రామన్న ఆయన కెరీర్‌లో మరో కీలక చిత్రంగా నిలిచింది. 2010లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణ కథకు భిన్నమైన నేపథ్యం, ఆసక్తికరమైన కథనం, కామెడీతో పాటు ఉత్కంఠను కలగలిపిన తీరు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సునీల్.. ఆ తర్వాత హీరోగా మారి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఆయన హీరోగా నటించిన అందాల రాముడు మంచి గుర్తింపు తెచ్చిపెట్టగా, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన మర్యాద రామన్న ఆయన కెరీర్‌లో మరో కీలక చిత్రంగా నిలిచింది. 2010లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణ కథకు భిన్నమైన నేపథ్యం, ఆసక్తికరమైన కథనం, కామెడీతో పాటు ఉత్కంఠను కలగలిపిన తీరు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా

## బిగ్‌బాస్ 10 చైత్ర రాయ్ కూతుళ్లను చూశారా





బిగ్ బాస్ తెలుగు సీజన్ 10లో ఆరో కంటెస్టెంట్ గా హౌస్ లోకి అడుగు పెట్టింది సీరియల్ నటి చైత్ర రాయ్. తన 10 నెలల బిడ్డను సైతం వదిలేసి ఈ రియాలిటీ షోలోకి అడుగు పెట్టిందీ అందాల తార. అప్పటికే బుల్లితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ బిగ్ బాస్ హౌస్ లో చాలా రోజుల పాటు ఉంటుందనుకున్నారు కానీ బిగ్ బాస్ హౌస్ లో కుదురుకునేలోపే చైత్ర రాయ్ ఎలిమినేట్ అయిపోయింది. మొదటి వారంలోనే ఆమె బయటకు వచ్చేసింది. దీంతో ఆమె అభిమానులు చాలా నిరాశకు లోనయ్యారు. తనను తాను నిరూపించేకునేందుకు చైత్ర కు కనీసం ఒక్క అవకాశం కూడా రాలేదని బిగ్ బాస్ ఫ్యాన్స్ ఫీలయ్యారు.కానీ బిగ్ బాస్ హౌస్ లో కుదురుకునేలోపే చైత్ర రాయ్ ఎలిమినేట్ అయిపోయింది. మొదటి వారంలోనే ఆమె బయటకు వచ్చేసింది. దీంతో ఆమె అభిమానులు చాలా నిరాశకు లోనయ్యారు. తనను తాను నిరూపించేకునేందుకు చైత్ర కు కనీసం ఒక్క అవకాశం కూడా రాలేదని బిగ్ బాస్ ఫ్యాన్స్ ఫీలయ్యారు. కాగా బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన చైత్ర మళ్లీ సీరియల్స్, టీవీ షోలతో బిజీ అవుతోంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇద్దరు కూతుళ్లతో కలిసి దిగిన క్యూట్ ఫొటోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసుకుంది. దసరాను సెలబ్రేట్ చేసుకున్న ఆమె ఈ ఫొటోలను అందరితో పంచుకున్నారు.కాగా బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన చైత్ర మళ్లీ సీరియల్స్, టీవీ షోలతో బిజీ అవుతోంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇద్దరు కూతుళ్లతో కలిసి దిగిన క్యూట్ ఫొటోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసుకుంది. దసరాను సెలబ్రేట్ చేసుకున్న ఆమె ఈ ఫొటోలను అందరితో పంచుకున్నారు. ప్రస్తుతం నటి చైత్ర రాయ్ షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ గా మారాయి. వీటిని చూసిన సినీ అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. చైత్ర ఇద్దరు కూతుళ్లు చాలా క్యూట్ గా ఉన్నారంటూ కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు.ప్రస్తుతం నటి చైత్ర రాయ్ షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ గా

## మీరంటే నాకు చాలా ఇష్టం.. ఆ హీరోకు ప్రపోజ్ చేసిన శ్రీముఖి



స్టార్ యాంకర్ శ్రీముఖి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. బుల్లితెరపై పలు షోలు, ఈవెంట్లతో తనదైన శైలిలో ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తూ టాప్ యాంకర్లలో ఒకరిగా కొనసాగుతోందీ అందాల తార. ఓవైపు టీవీ షోస్, ఈవెంట్స్ చేస్తూనే మరోవైపు అప్పుడప్పుడు సినిమాల్లోనూ కనిపిస్తోంది బుల్లితెర రాములమ్మ. ఇటీవల 'బిగ్ బాస్ అగ్నిపరీక్ష సీజన్ 2' కార్యక్రమానికి హోస్ట్‌గానూ వ్యవహరించి తనదైన శైలిలో ఆకట్టుకుంది శ్రీముఖి. ఇదిలా ఉంటే తాజాగా ఈ యాంకరమ్మ హోస్ట్ గా చేస్తోన్న ఓ టీవీ షోకు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ గెస్టుగా హాజరయ్యాడు. ముక్కు అవినాష్, ఎక్స్‌ప్రెస్ హరి , యాదమ్మ రాజు వంటి స్టార్ కమెడియన్స్ కూడా ఈ షోలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గెస్టుగా వచ్చిన తమన్ మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమన్, శ్రీముఖిల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఇందులో భాగంగానే ఓ మెగా హీరోకు లైవ్ లో ప్రపోజ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది శ్రీముఖి. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రోమో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రోమో విషయానికి వస్తే.. సినిమా ఇండస్ట్రీలో మీ బెస్ట్ ఫ్రెండ్స్ గురించి చెప్పండి అని తమన్ ను అడిగింది శ్రీముఖి . అఖిల్, సాయి ధరమ్ తేజ్ పేర్లను చెప్పాడు తమన్. ఆ వెంటనే శ్రీముఖి మాట్లాడుతూ.. సాయి ధరమ్ తేజ్ కి ఇప్పుడే ఫోన్ చేసి అర్జెంటుగా ఒక లక్ష రూపాయలు కావాలని అడగండి అని టాస్క్ ఇచ్చింది. తమన్ శ్రీముఖి చెప్పినట్టు సాయిధరమ్ తేజ్ కి ఫోన్ చేసి.. 'నువ్వు నా ఫ్రెండేనా ?అని అడిగాడు. దానికి సాయి ధరంతేజ్ 'కాదు' అని తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చాడు.ఆ తర్వాత తమన్ మాట్లాడుతూ 'నేను ఏదైనా సహాయం అడిగితే చేస్తావా లేదా అని అడగ్గా.. సాయి చేస్తానని చెప్పాడు. అప్పుడు తమన్ 'నాకు ఒక లక్ష రూపాయలు కావాలి. పొద్దున్నే ఇచ్చేస్తాను' అని అడిగాడు. 'ఇంత ఫాస్ట్ గా ఎలా ఇస్తావురా' అని సాయిధరమ్ తేజ్ అడిగితే శ్రీముఖి.. నా ఫ్రెండ్స్ దగ్గర తెచ్చి ఇస్తానని చెప్పు అని సైలెంట్ గా చెబుతుండగానే అవతలివైపు నుంచి సాయిధరమ్ తేజ ఆ అమ్మాయి ఎవరు అంటూ గొంతు పట్టేశాడు. తమన్ మాట్లాడుతూ.. 'రేయ్ నువ్వు కూడా స్మెల్ కూడా పట్టేస్తున్నావా? ? ఇక్కడ ఒక అమ్మాయి ఉంది. పెళ్లి చేసుకుంటావా అని థమన్ ప్రశ్నించగా? ఎవరు అని సాయి ధరమ్ తేజ్

## బిగ్ బాస్‌లో గోట్ ఆఫ్ ఎండ్యూరెన్స్ టాస్క్.. చివర్లో ఊహించని ట్విస్ట్.. నరేష్, శివ్ కన్నీళ్లు!



బిగ్ బాస్ ఇంట్లో గురువారం ఎపిసోడ్‌లో 'గోట్ ఆఫ్ ఎండ్యూరెన్స్' టాస్క్ ఆసక్తికరంగా సాగింది. ఎల్లో టీమ్‌లోని కంటెస్టెంట్లకు గ్రీన్ జోన్‌లోకి వెళ్లేందుకు బిగ్ బాస్ ఓ అవకాశం ఇచ్చాడు. ఈ టాస్క్‌లో చివరి వరకు నిలబడటమే కాకుండా, బరువును ఎక్కువసేపు మోయడం కంటెస్టెంట్లకు పెద్ద సవాల్‌గా మారింది. తొలుత ఈ గేమ్‌కు శ్వేతను సంచాలక్‌గా నియమించాడు బిగ్ బాస్. టాస్క్‌లో భాగంగా రెడ్ టీమ్ సభ్యులు ఎల్లో టీమ్ కంటెస్టెంట్లకు బిగ్ బాస్ సూచించిన వెయిట్స్‌ను తగిలించాలి. ఈ క్రమంలో సంచాలక్ పిలిచిన కంటెస్టెంట్‌కు నిర్ణీత బరువును జత చేస్తూ ఆటను కొనసాగించారు. అయితే మొదట్లోనే ఆర్కేకు అవకాశం ఇవ్వగా.. అతడు నాలుగు వెయిట్స్‌ను వర్షిణికి తగిలించడంతో ఆమెపై భారం పెరిగింది.ఈ టాస్క్‌లో శివ్, త్రిగుణ్, దేబ్జానీ, వర్షిణిలను ఎక్కువగా టార్గెట్ చేశారు. మరోవైపు ముకేష్, నరేష్, రామ్ ప్రసాద్, అమన్‌లకు తొలుత పెద్దగా వెయిట్స్ వేయలేదు. ముఖ్యంగా ముకేష్, రోహిత్ గ్యాంగ్ శివ్, త్రిగుణ్‌లపై ఎక్కువగా ఫోకస్ పెట్టినట్లు కనిపించింది. వర్షిణి ఎక్కువ బరువును మోయలేక ముందుగానే కుప్పకూలిపోయింది. కళ్లు తిరిగి కిందపడటంతో టాస్క్ మరింత ఉత్కంఠగా మారింది. ఆ తర్వాత శివ్ సుమారు 32 కిలోల బరువును మోస్తూ అందరి టార్గెట్‌గా నిలిచాడు. చివరకు అతడు కూడా భారాన్ని తట్టుకోలేక ఆట నుంచి తప్పుకున్నాడు. నీతూ సైతం చాలాసేపు వెయిట్స్ మోసిన తర్వాత టాస్క్‌ను వదిలేసింది.ఇక త్రిగుణ్‌పై కూడా వెయిట్స్ పెరుగుతూనే వచ్చాయి. రోహిత్, సుధీర్, షాలినీ అతడిని ఎక్కువగా టార్గెట్ చేయడంతో చివరకు త్రిగుణ్ కూడా ఆట నుంచి తప్పుకున్నాడు. అనంతరం శివ్, త్రిగుణ్‌లు ముకేష్‌ను టార్గెట్ చేయగా.. అతడు కూడా టాస్క్ నుంచి వైదొలిగాడు. ఆ తర్వాత అమన్, రామ్ ప్రసాద్, నరేష్ మిగిలిన సమయంలో వంశీ, శ్వేత వెయిట్స్‌ను బ్యాలెన్స్ చేసే ప్రయత్నం చేశారు. అయితే కొంతసేపటికి రామ్ ప్రసాద్ కూడా ఆట నుంచి తప్పుకోవడంతో అమన్, నరేష్ మాత్రమే మిగిలారు. ఈ దశలో ఎక్కువమంది అమన్‌కు వెయిట్స్ వేస్తూ అతడిని టార్గెట్ చేశారు. రామ్ ప్రసాద్, ముకేష్, శివ్ తదితరులు అమన్‌పై బరువును పెంచడంతో అతడికి పరిస్థితి మరింత కష్టంగా మారింది. మరోవైపు నరేష్‌కు మాత్రం తక్కువ వెయిట్స్ వేయడంతో అతడు చివరి వరకు నిలబడగలిగాడు.

## నా వైఫ్ మిస్సింగ్ సినిమా రివ్యూ




కథ:బాల సుబ్రమణ్యం (వరుణ్ సందేశ్) వృత్తిరీత్యా ఓ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తుంటాడు. పెద్దలు కుదిర్చిన పెళ్లిలో స్వప్న (శ్వేతా బసు ప్రసాద్)తో అతని వివాహం జరుగుతుంది. అయితే పెళ్ళైన కొత్త నుంచే ఆ భార్యాభర్తల మధ్య సఖ్యత లోపిస్తుంది, తరచుగా మనస్పర్థలతో గొడవలు పడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇద్దరూ కలిసి గుడికి వెళ్లిన సమయంలో స్వప్న సడెన్‌గా మాయమవుతుంది. తన భార్య కనిపించడం లేదంటూ బాల సుబ్రమణ్యం పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇస్తాడు. అసలు గుడిలో ఉన్న స్వప్న ఏమైంది? ఆమె ఎటో వెళ్లిపోయిందా లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా? భార్యను వెతికే క్రమంలో ఈ భర్తకు ఎదురైన సవాళ్లు ఏంటి? వాళ్లిద్దరి మధ్య దూరం పెరగడానికి అసలు రీజన్ ఏంటి? అన్నదే ఈ సినిమా మెయిన్ ప్లాట్.

కథనం:థ్రిల్లర్ సినిమాలకు స్క్రీన్ ప్లే చాలా కీలకం. ఈ విషయంలో డైరెక్టర్ నాన్–లీనియర్ పద్ధతిని (ముందుకూ వెనకకూ వెళ్లే విధానం) ఫాలో అవుతూ కథను ముందుకు తీసుకెళ్లిన తీరు బాగా వర్కవుట్ అయింది. సినిమా మొదలైనప్పటి నుంచి భార్యాభర్తలు ఇద్దరి మీదా ప్రేక్షకుడికి ఒక రకమైన అనుమానం కలిగేలా సీన్స్ రాసుకోవడం సినిమాకు ప్లస్ అయ్యింది. ముఖ్యంగా కథలో వచ్చే రెండు మెయిన్ ట్విస్టులు ఆడియన్స్‌ను ఆకట్టుకుంటాయి. అయితే ఆ ట్విస్టులు ఇంకాస్త బలంగా పండాలంటే క్యారెక్టర్స్ మధ్య స్ట్రాంగ్ ఎమోషనల్ కనెక్షన్ ఉండాలి, కచ్చితంగా ఆ విషయంలో ఈ మూవీ అక్కడక్కడా స్లో అయినట్లు అనిపించినా కూడా ఆడియన్స్ పక్కకు వెళ్లకుండా ఆపగలిగే స్క్రీన్ ప్లేతోనే వచ్చింది. ఒక కీలకమైన క్యారెక్టర్ నిజాలు తెలుసుకుని సడెన్‌గా తన మనసు మార్చుకునే సీన్ చూస్తే ఆడియన్స్‌కు మొత్తరుగా కనెక్ట్ అవుతుంది. అలాగే సినిమా నిడివిని వీలైనంత తక్కువగా ఉంచాలనే తొందరలో దర్శకురాలు చాలా సీన్స్‌ను డీటెయిల్డ్‌గా చూపించకుండా పైపైన టచ్ చేస్తూ వెళ్లిపోయారు. సస్పెన్స్ రివీల్ చేసే విధానం ఇంకాస్త ఉత్కంఠభరితంగా ప్లాన్ చేసుకుని ఉంటే ఇంకాస్త బాగుండేది. ఇక క్లైమాక్స్ కూడా బాగానే డీల్ చేసారు. కోర్టు రూమ్ డ్రామాలను ఇష్టపడే ప్రేక్షకులకు మాత్రమే ఈ స్క్రీన్ ప్లే రుచిస్తుంది.

## ఉదయం ఓట్స్, రాత్రి సలాడ్.. ఆకలి వేసినప్పుడు ఏం చేస్తానంటే..



భారతీయ సినీ ప్రియులు 'ఇండియన్ మైఖేల్ జాక్సన్' అని పిలుచుకునే నటుడు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా. ప్రస్తుతం ఆయన వయసు 53 సంవత్సరాలు. ఇప్పటికీ యంగ్ హీరోలకు ధీటుగా తన ఫిట్నెస్ తో ఆశ్చర్యపరుస్తుంటారు. అందుకే ఆయన ఫిట్నెస్ వెనుక రహస్యం తెలుసుకోవాలని ట్రై చేస్తుంటారు చాలా మంది. తాజాగా తన డైట్ సీక్రెట్ వెల్లడించారు. తన శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుకోవడానికి ఆహారంలో మార్పులు చేసుకుంటానని ప్రభుదేవా చెబుతున్నారు.ఒక ఇంటర్వ్యూలో ప్రభుదేవా తన ఆహారపు అలవాట్ల గురించి ఇలా చెప్పారు: "నా ఆహారపు అలవాట్లు మారుతూ ఉంటాయి. కొంతకాలం క్రితం, నేను మూడు రోజులు డైట్ పాటించి, నాలుగో రోజు తినేవాడిని. కానీ ఇప్పుడు ఉదయం పూట ఓట్స్, జ్యూస్ తాగుతున్నాను. మధ్యాహ్న భోజనంలో మామూలుగా తినే అన్నం మానేశాను. దానికి బదులుగా, రెండు చెంచాల మాప్పిళ్లై సాంబ బియ్యం, కుతిరవలి (సాంప్రదాయ జొన్న) తింటున్నాను" అని అన్నారు.
ఒక ఇంటర్వ్యూలో ప్రభుదేవా తన ఆహారపు అలవాట్ల గురించి ఇలా చెప్పారు: "నా ఆహారపు అలవాట్లు మారుతూ ఉంటాయి. కొంతకాలం క్రితం, నేను మూడు రోజులు డైట్ పాటించి, నాలుగో రోజు తినేవాడిని. కానీ ఇప్పుడు ఉదయం పూట ఓట్స్, జ్యూస్ తాగుతున్నాను. మధ్యాహ్న భోజనంలో

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224